



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 249 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 31 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-


హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో

# మౌలిక సదుపాయాల కల్పన


- అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- భవిష్యత్ ప్రణాళికలపై చర్చ.. మొత్తం 18 ప్రతిపాదనలకు ఆమోదం
- అమరావతికి సొంత అగ్నిమాపక విభాగం, బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- 9 జిల్లాలను కలుపుతూ అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ప్రణాళిక



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 18 కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధానిలో పటిష్టమైన అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా, హైకోర్టు భవనాలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.547.07 కోట్లు కేటాయించడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పీపీపీ పద్ధతిలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి, భవన నిర్మాణ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు, అమరావతిలో సమర్థవంతమైన అగ్నిమాపక నియంత్రణ కోసం సీఆర్డీఏకు సొంత ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారు. ఏలూరు నుంచి ప్రకాశం వరకు 9 జిల్లాలకు విస్తరించే అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కూడా అంగీకారం తెలిపారు. రాజధానిలోని అన్ని భవనాలకు సెంట్రల్ కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రతి టౌన్‌షిప్‌లో ఆర్థిక కార్యకలాపాలు ఉండేలా చూడాలని సీఎం సూచించారు. వీటితో పాటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఎల్పీఎస్ లేఅవుట్లలో ఏటీఎంల ఏర్పాటు, 495 మంది రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి పలు అంశాలను అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సీఎస్ జి. సాయి ప్రసాద్, మిగతా .. 2లో..

భారత పర్యటనలో

# ట్రంప్ కుమార్తె



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె టిఫానీ భారత్‌లో పర్యటిస్తున్నారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా శుక్రవారం ఢిల్లీ చేరుకున్న ఆమె.. ప్రఖ్యాత స్వామి నారాయణ్ అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని శిల్పకళను చూసి టిఫానీ ట్రంప్ అబ్బురపడిపోయారు. ఆలయ ఆవరణలో 108 అడుగుల నీలకంఠ్ వర్ణీ విగ్రహాన్ని సందర్శించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆమె తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. కాగా.. ఈ పర్యటనలో భాగంగా టిఫానీ ఆగ్రాకు వెళ్లనున్నారు. ప్రపంచంలోని అద్భుత కట్టడాల్లో ఒకటైన తాజ్ మహల్‌ను సందర్శించనున్నారు. అక్కడి నుంచి ఆమె రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఇది ఆమె వ్యక్తిగత పర్యటన మిగతా .. 2లో..

# ఏసీబీ పేరుతో మోసం...??

"మీ తప్పుల చిట్టా మా వద్ద ఉంది" అంటూ...
వీఆర్వోలు, కార్యదర్శులకు బెదిరింపు కాల్స్..??

**అద్దంకి, బల్లికురవ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా బల్లికురవ మండలంలో ఏసీబీ అధికారుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండలానికి చెందిన 10 మంది వీఆర్వోలు, 8 మంది పంచాయతీ కార్యదర్శులకు ఫోన్ చేసి మిగతా .. 2లో..

సీఎల్పీ నేతగా

# డీకే శివకుమార్ ఎన్నిక



**బెంగళూరు (చిత్రదుర్గం), విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసన సభాపక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు మిగతా .. 2లో..

రాళ్లు, గుడ్లు, చెప్పులతో..

మమత

# మేనల్లుడిపై దాడి



**విశ్వం వాయిస్ న్యూస్ :** మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు సోనార్‌పుర్ వెళ్లిన ఆయనపై స్థానికులు రాళ్లు, కోడి గుడ్లు చెప్పులు విసిరారు. కొందరు ఆయనపై చేయి చేసుకున్నారు. అభిషేక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మిగతా .. 2లో..

తితిదేకు భారీ విరాళం అందించిన


# నీరా రాడియా



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానానికి భారీ విరాళం అందింది. ఒక విద్యుత్ బస్సుతో పాటు వైకుంఠ క్యూ కాంప్లెక్సు ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు ఉపయోగపడే 15 యాపిల్ ట్యాబ్‌లను నీరా రాడియా అందజేశారు. శ్రీవారి ఆలయం ఎదుట విద్యుత్ బస్సుకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం బస్సు తాళం, ట్యాబ్‌లను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి.. దాత అందించారు. అనంతరం మిగతా .. 2లో..

# ఇరాన్‌తో డీల్..

సంతకం చేయని ట్రంప్




**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం ఇప్పుడప్పుడే ముగిసేలా కన్పించట్లేదు. ఇరాన్‌తో కాల్పుల విరమణ పొడిగింపు, హర్మూజ్‌లో దిగ్బంధనం ఎత్తివేతకు సంబంధించిన తాత్కాలిక ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయలేదు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చినట్లయ్యింది. ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం మిగతా .. 2లో..

జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను


# సందర్శించిన పవన్ కల్యాణ్

నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**నాయుడుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు. ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై మిగతా .. 2లో..

# గ్రీన్‌కార్డులపై అమెరికా సర్కారు యూటర్న్




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డ్) నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్ తీసుకుంది. గ్రీన్‌కార్డ్ దరఖాస్తు ప్రక్రియ జరుగుతోన్న సమయంలో వలసదారులు యూఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తాత్కాలిక వలసదారులు మిగతా .. 2లో..

'అదే జరిగితే

# ఎన్నికల్లో పోటీ చేయం'

బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా? అని సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. "అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుంది. మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదు.

**'హరీశ్‌రావు ఆ విషయం ఒట్టేసి చెప్పాలి'..**

కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని మిగతా .. 2లో..

సార్ ముందు మనసు విప్పి

# మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా..

పవన్ కల్యాణ్ పై మరోసారి తన అభిమానాన్ని చాటుకున్న బండ్ల గణేష్
ఆయన గొప్పదనం, వ్యక్తిత్వం గురించి ప్రపంచానికి చెబుతానని వ్యాఖ్య
పదవులు కాదు, వ్యక్తిత్వమే ముఖ్యమని నిరూపించిన వ్యక్తి పవన్ అని కితాబు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ మరోసారి పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తనకున్న ప్రగాఢ అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ గురించి మనసు విప్పి మాట్లాడే అవకాశం కోసం తాను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నానని ఆయన అన్నారు. ఆ రోజు వచ్చినప్పుడు పవన్ గొప్ప మనసు, వ్యక్తిత్వం గురించి తనకు తెలిసిన నిజాలను ప్రపంచం ముందు గర్వంగా చెబుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ "పవన్ కల్యాణ్ సార్ గురించి నాకు తెలిసిన నిజాలను, ఆయన క్యారెక్టర్‌ను, ఆయన నైజాన్ని ప్రపంచానికి చెప్పే అవకాశం కోసం మిగతా .. 2లో..

విశాఖకు రూ. 1,500 కోట్ల విలువైన

# ప్రాజెక్టులు మంజూరయ్యాయి

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నగరానికి ప్రాజెక్టులు మంజూరయ్యాయన్న శ్రీభరత్
గత ప్రభుత్వ హయాంలో పనులు నిలిచిపోయాయని విమర్శ



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించేందుకు 'దిశ' సమావేశం ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోందని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అన్నారు. విశాఖలో నిర్వహించిన దిశ సమావేశంలో 33 విభాగాలకు చెందిన అధికారులతో కలిసి పలు అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న విశాఖను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నగరానికి రూ.1,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరైనట్లు శ్రీభరత్ ప్రకటించారు. ఇందులో భాగంగా మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, నగర నీటి పంపిణీ వ్యవస్థ బలోపేతం వంటి కీలక పనులను చేపట్టబోతున్నట్లు మిగతా .. 2లో..

డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం పట్ల

# యువత తిరగబడాలి

ఎన్నికల్లో ఓటమికి ప్రతీకారంగానే వైసీపీ డీఎస్సీపై కక్ష కట్టిందన్న శాప్ ఛైర్మన్ రవినాయుడు



**విశ్వం వాయిస్ న్యూస్ :** గత ఎన్నికల్లో తమను ఓడించారన్న అక్కసుతోనే నిరుద్యోగ యువతపై వైసీపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై రాజకీయ దురుద్దేశంతో వైసీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం పట్ల యువత తిరగబడాలని పిలుపునిచ్చారు. తిరుపతిలో "నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు" పేరిట నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కొత్తగా మిగతా .. 2లో..

సిబిఎస్ఇ మార్కుల గందరగోళంపై

# విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం : కేటీఆర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో 2019 ఇంటర్ ఫలితాలను తారుమారు చేసిన గ్లోబరీనా అనే సంస్థ.. తన పేరు మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి కాంట్రాక్టును దక్కించుకుని, అంతకంటే పెద్ద గందరగోళాన్ని సృష్టించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. సీబీఎస్ఈ మార్కుల వ్యవహారంపై పోరాడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అధికారంలో ఉన్నవారిని వారు జవాబుదారీగా నిలబెడుతున్న తీరు స్ఫూర్తిదాయకమని మిగతా .. 2లో..

రాష్ట్ర హక్కుల పరిరక్షణకే..

# తెలంగాణ రక్షణ సేన పుట్టింది : కవిత



**మొయినాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏ లక్ష్యాల కోసం తెలంగాణను సాధించుకున్నామో.. వాటి సాధనతో పాటు రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జెండా పండుగ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో

# మౌలిక సదుపాయాల కల్పన

ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కోటి మంది లక్ష్యంగా 'యోగాంధ్రఏ2026'.. జూన్ 21న కృష్ణా నదిపై సీఎం యోగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో 'యోగాంధ్రఏ2026' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 21న జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు కోటి మంది ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ కార్యక్రమ నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, జూన్ 21న రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా ఈవెంట్ నిర్వహించనున్నారు. కృష్ణా నదిపై కొత్తగా నిర్మించిన వంతెనపై జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొంటారు. అదే రోజున అన్ని జిల్లా కేంద్రాల్లో వెయ్యి మంది చొప్పున యోగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా వారోత్సవాలు జరగనున్నాయి. "ఒక జిల్లా - ఒక థీమ్"తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని 56 పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక యోగా సెషన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గాను ప్రతి జిల్లాకు రూ. 25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న 1.50 లక్షల మంది యోగా శిక్షకులకు అదనంగా మరో లక్ష మందికి శిక్షణ ఇచ్చి, వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగం చేయనున్నారు.

**ప్రజలకు అందుబాటులో యోగా వీడియోలు**

ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన 'యోగాంధ్ర' పోస్టర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. వివిధ ఆసనాలు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలపై తాను రూపొందించిన వీడియోలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు మంతెన తెలిపారు. 8142404888 నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపడం ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వీడియోలను పొందవచ్చని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**'గొడ్డలి పార్టీ' అనే పేరుతో వైసీపీలో ఫ్రస్ట్రేషన్ పెరిగిందన్న సీఎం**

తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు తప్పుపట్టారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు నేతలు సంయమనం పాటించాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీయకూడదని ఆయన హితవు పలికారు. "తెలంగాణ అనే పదం నిఘంటువులోనే లేదు" అంటూ బక్కని ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు ఈ స్పష్టత ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. తెలుగు జాతి ఒక్కటేనని, తెలంగాణలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని స్పష్టం చేశారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్ లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. 'గొడ్డలి పార్టీ' అనే పేరు ప్రజల్లోకి బలంగా వెళుతుండటంతో వారిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. వైఎస్ కుటుంబ అరాచకాలు తమకు కూడా పూర్తిగా తెలియవని, ఇలాంటి వారు ప్రజాస్వామ్యానికి పనికిరారని అన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటానికి చంద్రబాబు మద్దతు తెలిపారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని, ఆమె పోరాటం వల్లే ఈ కేసు ఇంకా సజీవంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పట్టుదలగా ఉందని, అవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తెస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పునర్విభజనలో రాష్ట్రానికి నష్టం జరగకుండా ప్రస్తుతమున్న స్థానాలను 50 శాతం పెంచితే మేలు జరుగుతుందని సూచించారు.

### సీఎల్పీ నేతగా

# డీకే శివకుమార్ ఎన్నిక

వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది. మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకోసం బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపింది. తాజాగా సీఎల్పీ నేతగా ఎన్నికైన డీకేఎస్.. గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు తనను ఆహ్వానించాలని కోరారు. ఇందుకు అంగీకరించిన ఆయన.. ప్రభుత్వ ఏర్పాటుకు డీకే శివకుమార్‌ను ఆహ్వానించారు. దీంతో జూన్ 3న సాయంత్రం 4 గంటలకు లోక్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### రాళ్లు, గుడ్లు, చెప్పులతో..

# మమత మేనల్లుడిపై దాడి

దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దాడి జరుగుతున్న సమయంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా.. భద్రతా సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. అనంతరం చిరిగిన చొక్కాతో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు భాజపానే కారణమని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి చేశారని.. తనను చంపేందుకు ప్రయత్నించారని అన్నారు. దాడి సమయంలో పోలీసులు ఎక్కడా కనిపించలేదన్నారు. ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తానని తృణమూల్ నేత పేర్కొన్నారు.

# తితిదేకు భారీ విరాళం అందించిన నీరా రాడియా

చైర్మన్, ఇతర అధికారులు బస్సులో ప్రయాణించి బస్సు సామర్థ్యాన్ని పరీక్షించారు. తితిదేలో మొత్తం 20 ధర్మరథం బస్సులు ఉంటే.. వాటిలో 14 విద్యుత్ బస్సులు ఉన్నాయని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ధర్మరథం బస్సులు 380 ట్రిప్పుల ద్వారా 21 బస్ స్టాప్‌లలో భక్తులకు సేవలందిస్తున్నాయని తెలిపారు.

# ఇరాన్‌తో డీల్..

తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యువేషన్ రూమ్‌లో ట్రంప్ తన సలహాదారులతో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వీరి మధ్య చర్చలు జరిగాయి. అయినప్పటికీ.. ఒప్పందంపై ఎలాంటి పురోగతి లేదు. ఈ డీల్‌పై సంతకం చేయకుండానే ట్రంప్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామాలపై వైట్‌హౌస్ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా అది అమెరికాకు మేలు చేసేదిగా ఉండాలని, టెహ్రాన్‌పై విధించే ఆంక్షలు, నిబంధనలపై ట్రంప్ సంతృప్తి చెందాలన్నారు. ఆ తర్వాతే అధ్యక్షుడు డీల్‌పై సంతకం చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదన్నారు. మరోవైపు, డీల్ విషయంపై అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. ఇంకా తుది ఒప్పందం ఖరారు కాలేదన్నారు.

**మళ్లీ యుద్ధం ప్రారంభించే సత్తా ఉంది: హెగ్సెత్**

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ఇరాన్‌తో యుద్ధం తిరిగి ప్రారంభించే సత్తా అగ్రరాజ్యానికి ఉందన్నారు. తమ ఆయుధ నిల్వలు నిండుగా ఉన్నాయన్నారు. ఇక, అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా కీలక పోస్టు పెట్టింది. పశ్చిమాసియాలో తమ దళాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. దీంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అనే ఆందోళన నెలకొంది.

### భారత పర్యటనలో

# ట్రంప్ కుమార్తె

అయినప్పటికీ.. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా.. టిఫానీ భారత్‌కు రావడం ఇది తొలిసారి కాదు. 2018లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ భారత్‌లో అధికారికంగా పర్యటించారు. అప్పుడు తండ్రితో పాటు టిఫానీ కూడా ఇక్కడకు వచ్చారు. ట్రంప్ రెండో భార్య మార్లా కుమార్తే టిఫానీ.

# ఏసీబీ పేరుతో మోసం...??

భయాందోళనలకు గురిచేశారు.

**డబ్బులు చెల్లించకపోతే చర్యలంటూ బెదిరింపులు :**

ఫోన్ చేసిన వ్యక్తులు తమను ఏసీబీ అధికారులమని పరిచయం చేసుకుని, సంబంధిత ఉద్యోగులపై ఉన్న అక్రమాల వివరాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. తాము సూచించిన ఖాతాకు వెంటనే ఆన్‌లైన్ ద్వారా నగదు పంపించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**మోసగాళ్ల మాటలు నమ్మి రూ.1.50 లక్షలు చెల్లింపు :**

బెదిరింపులకు భయపడిన ఓ వీఆర్వో తన బంధువుల ద్వారా రూ.50 వేల చొప్పున మూడు దఫాల్లో మొత్తం రూ.1.50 లక్షలు పంపినట్లు సమాచారం. అనంతరం అనుమానం రావడంతో జరిగిన విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

**"ఏసీబీ అధికారులు ఇలా డబ్బులు అడగరు" :**

విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ స్పందిస్తూ, అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎలాంటి విచారణ ఉన్నా నేరుగా అధికారిక విధానంలోనే వ్యవహరిస్తారని, ఫోన్ ద్వారా డబ్బులు డిమాండ్ చేయడం జరగదని స్పష్టం చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు :**

మోసానికి గురైనట్లు గుర్తించిన బాధితులు వెంటనే ఈ వ్యవహారాన్ని సంతమాగులూరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**అధికారులకు హెచ్చరిక :**

సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను గుడ్డిగా నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే ఉన్నతాధికారులు లేదా పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

### జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను

# సందర్శించిన పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

# గ్రీన్‌కార్డులపై అమెరికా సర్కారు యూటర్న్

గ్రీన్‌కార్డ్ దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ(యూఎస్‌సీఐఎస్) మే 21న చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా డీహెచ్‌ఎస్ వివరణ ఇచ్చింది. తాజా ప్రకటనలో డీహెచ్‌ఎస్ స్పందిస్తూ.. ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పేమీ కాదని పేర్కొంది. దరఖాస్తుదారుడు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్నదానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటినుంచో అమల్లో ఉన్న నిబంధనే అని పేర్కొంది. ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తుచేయడమే మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశమని వివరించింది. శాశ్వత నివాసం కోరుతున్న వలసదారుల దరఖాస్తుల పరిశీలన జరుగుతున్న సమయంలో కూడా వారు యూఎస్‌లో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. వీసా ఓవర్‌స్టేలు, ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర ఆందోళనలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా వెల్లడించింది. డీహెచ్‌ఎస్ వివరణ ఇచ్చినప్పటికీ.. ఎలాంటి పరిస్థితుల్లో గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులు యూఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం ఉంటుందో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దాంతో ఈ వ్యవహారంపై వలసదారుల్లో పలు ప్రశ్నలు మిగిలేఉన్నాయి.

### 'అదే జరిగితే

# ఎన్నికల్లో పోటీ చేయం'

హరీశ్‌రావు చెప్పాలి. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్‌ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్‌ఈలో జవాబుపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు? 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదు" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

### సార్ ముందు మనసు విప్పి

# మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా..

వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాను. పదవులు, హోదాలు కాదు.. మనిషి విలువ అతని ప్రవర్తన, మాట, మనసులో ఉంటుందని నిరూపించిన వ్యక్తి ఆయన" అని ప్రశంసించారు. అలాంటి మహోన్నత వ్యక్తి గురించి తన హృదయంలో ఉన్న గౌరవాన్ని వ్యక్తపరిచే ఆ క్షణం కోసం వేచి చూస్తున్నట్లు బండ్ల గణేష్ తన వ్యాఖ్యల్లో తెలిపారు. పవన్ కల్యాణ్ పట్ల బండ్ల గణేష్ కు ఉన్న అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పలు సందర్భాల్లో ఆయన పవన్ ను దేవుడిగా అభివర్ణించిన విషయం తెలిసిందే. పవన్ కల్యాణ్ ఇవాళ నాయుడుపేటలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా బండ్ల గణేష్ ఈ ట్వీట్ చేశారు.

### విశాఖకు రూ. 1,500 కోట్ల విలువైన

# ప్రాజెక్టులు మంజూరయ్యాయి

తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో అభివృద్ధి పనులు పూర్తిగా మందగించాయని శ్రీభరత్ విమర్శించారు. అనేక కీలక ప్రాజెక్టులను పక్కనపెట్టడం వల్ల వాటి నిర్మాణ వ్యయం ప్రస్తుతం భారీగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన పనులను ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొత్త పథకాల ద్వారా తిరిగి ముందుకు తీసుకువస్తోందని స్పష్టం చేశారు. అలాగే విశాఖ బీచ్‌లలో లభించే ఖనిజ సంపదను కూడా త్వరలోనే వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

### డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం పట్ల

# యువత తిరగబడాలి

ఉద్యోగాలకు ఎంపికైన వెయ్యి మందికి పైగా టీచర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంతో డీఎస్సీలో ఎంపికైన టీచర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, కష్టపడి ఉద్యోగాలు సాధించిన పేద కుటుంబాల యువత కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "రాజకీయంగా మాతో తలపడాలి కానీ, యువత జీవితాలతో ఆడుకోవడం తగదు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని జగన్, ఎన్నికలకు రెండు నెలల ముందు అసమగ్ర డీఎస్సీ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 150 రోజుల్లో 15,941 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. దీన్ని అడ్డుకోవడానికి వైసీపీ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లి 150 కేసులు వేశారు" అని రవినాయుడు గుర్తుచేశారు.

**స్పోర్ట్స్ కోటాపై విచారణకు సిద్ధం**

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు అమ్ముకున్నారన్న ఆరోపణలను రవినాయుడు తీవ్రంగా ఖండించారు. క్రీడాకారులకు సర్టిఫికేట్లు ఇచ్చేది అసోసియేషన్లు, ఫెడరేషన్లేనని, వాటిని ధృవీకరించుకున్నాకే 427 పోస్టులు భర్తీ చేశామని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 3 శాతం స్పోర్ట్స్ కోటా అమలు చేస్తే దానిపై నిందలు వేయడం దారుణమన్నారు. తమ హయాంలో, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఎటువంటి విచారణకైనా సిద్ధమని ఆయన సవాల్ విసిరారు.

**యువత ఏకమై జగన్‌ను తరిమికొట్టాలి: ఎమ్మెల్సీ శ్రీకాంత్**

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. లక్షలాది మంది యువత ఆశలపై విషం చిమ్ముతున్న జగన్మోహన్ రెడ్డి నరరూప రాక్షసుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యువత కష్టపడి సాధించిన ఉద్యోగాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకుంటామని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఏకమై జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.

**డ్రైవర్లతో పేపర్లు దిద్దించిన చరిత్ర మీది: ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి**

మరో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వైసిపి నేతలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పేపర్లను మంగళగిరి వద్ద హాయ్ ల్యాండ్‌లో డ్రైవర్లు, పనివాళ్లతో దిద్దించారని సంచలన ఆరోపణలు చేశారు. "అటువంటి చరిత్ర ఉన్న వైసీపీకి, పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించిన కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసే నైతిక అర్హత ఉందా?" అని ఆయన నిలదీశారు. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారి జాబితాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని, తప్పు జరిగిందని నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెబుతామని స్పష్టం చేశారు.

### సిబిఎస్ఇ మార్కుల గందరగోళంపై

# విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం : కేటీఆర్

పేర్కొన్నారు. "గతంలో తెలంగాణలో గ్లోబరీనా వ్యవహారంపై బీఆర్ఎస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. ముగ్గురు సభ్యుల కమిటీ నివేదిక ఆధారంగా.. సంబంధిత అధికారులను తొలగించింది. అదేవిధంగా ఆ సంస్థపై కోర్టులో కేసు వేసింది. ఆ సంస్థ చరిత్రను సీబీఎస్ఈ విస్మరించింది. అసమర్థ సంస్థకు అనుకూలంగా ఉండేందుకే సీబీఎస్ఈ నిబంధనలను మార్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కేంద్రం, విద్యాశాఖ మంత్రి సమాధానం చెప్పాలి. ఇటువంటి వ్యవస్థపై దేశ భవిష్యత్తును నిర్మించలేం" అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.

### రాష్ట్ర హక్కుల పరిరక్షణకే..

# తెలంగాణ రక్షణ సేన పుట్టింది : కవిత

నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించారు. గతంలో భారాస, ప్రస్తుతం కాంగ్రెస్.. రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి గుదిబండగా మారిన జీవో 111 విషయంలోనూ మాట తప్పాయని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను ఎత్తేస్తామని హామీ ఇచ్చారు. యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు ఎలాంటి గ్యారంటీ లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేనలో చేరారు.

# ఎడిటర్ వాయిస్

## రఘురామకు సునీల్ కుమార్ ఓపెన్ ఛాలెంజ్!

ఏపీలో ఉప సభాపతి రఘురామ క్రిష్ణంరాజు, అలాగే ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ ల మధ్య డైలాగ్ వార్ ఒక రేంజిలో సాగుతున్న సంగతి తెలిసిందే. రఘురామ ఒకటి అంటే పీవీ సునీల్ రెండు అంటున్నారు. ఈ ఇద్దరి మధ్యన డైలాగ్ వార్ కాస్తా కేసులు సామాజిక అంశాలు దాటి ఇపుడు రాజకీయ సమరానికి వేదికగా మారబోతోందా అన్న కొత్త చర్చ మొదలైంది. రఘురామ క్రిష్ణంరాజుకి తాజాగా పీవీ సునీల్ కుమార్ ఓపెన్ చాలెంజ్ విసిరారు. మీరు మీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి, ఉప ఎన్నికల్లో మీరు వైసీపీతో సహా అన్ని పార్టీల మద్దతుని తీసుకుని మరీ బరిలో నిలవండి, నేను ఒంటరిగా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తాను, మీ మీద కనీసం వేయి కోట్లు అయినా ఎక్కువగా నేను సాధించి గెలిచి నిలవకపోతే నో పాలిటిక్స్ అంటూ ఒక పవర్ ఫుల్ సవాల్ నే విసిరారు.

**సత్తా తేల్చాల్సిందే :** ఈ మధ్యన రఘురామ ఒక టీవీ చానెల్ లో మాట్లాడుతూ జడ శ్రావణ్ కుమార్, అలాగే విజయ్ కుమార్ పోటీ చేస్తే పెద్దగా ఓట్లు రాలేదని సునీల్ కుమార్ కూడా పోటీ చేస్తే ఒక అయిదారు వందల ఓట్లు దాకా వస్తాయా అని కామెంట్ చేస్తారని సునీల్ కుమార్ అన్నారు. అందుకే ఆయన మాట మీద నిలబడాలని రాజీనామా చేసి ఉప ఎన్నికలు ఉండి నియోజకవర్గంలఒ తెస్తే ఎవరేమిటో తేలిపోతుందని అన్నారు. తనకు జన బలం లేదని నిరూపించేందుకు ఇది మంచి అవకాశంగా రఘురామ తీసుకోవచ్చు అన్నారు. అలాగే నూటికి 80 శాతం తమ వైపు ఇరవై శాతమే అవతల వైపు ఉన్నారని చెబుతున్న రఘురామ సిద్ధాంతం కూడా ఏమిటో తెలుస్తుందని కూడా అన్నారు.

**కండిషన్స్ అప్లై :** అయితే ఈ పోటీలో తాను రఘురామ మీద వేయి కోట్లు ఎక్కువగా తెచ్చుకోకపోతే ఇక మీదట రాజకీయాలు మాట్లాడను అని సునీల్ కుమార్ అన్నారు. అదే రఘురామ ఓటమి చెందితే రాజకీయాల గురించి మాట్లాడకుండా ఉంటారా అని ప్రశ్నించారు. ఈ కండిషన్లకు కూడా రెడీ అయి పోటీకి సిద్ధపడాలని ఆయన కోరారు.

**మీకు తెలియదేమో అంటూ :** ఇక సునీల్ కుమార్ తన బలాన్ని కూడా పరోక్షంగా తాను విడుదల చేసిన తాజా వీడియో బైట్ లో తెలియచేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఒకాయన తన పేరు చెప్పుకుని ఓపెన్ సీట్లో ఇండిపెండెంట్ గా నిలబడి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తే గెలిచారని చెప్పారు. అలాగే నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఒకాయన తన ఫోటో పెట్టుకుని ఇండిపెండెంట్ గా పోటీ చేసి అయిదు వేల ఓట్లను సాధించారు అని పీవీ సునీల్ కుమార్ గుర్తు చేశారు. బహుశా ఇవేమీ రఘురామ క్రిష్ణంరాజుకు తెలియవేమో అని సెటైర్లు వేశారు. మొత్తానికి చూస్తే పీవీ సునీల్ కుమార్ తనకు రాజకీయంగా సత్తా ఉందని చెప్పకనే



చెబుతున్నారు. అంతే కాదు రఘురామతో పోటీ చేసి ఢీ కొట్టాలని కూడా చూస్తున్నారు. మరి ఈ ఓపెన్ చాలెంజ్ కి రఘురామ క్రిష్ణంరాజు రెడీనా కాదా అన్నది చూడాల్సి ఉంది. సో వెయిట్ అండ్ సీ.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## దశాబ్దాల పగతోనే న్యాయవాది హత్య

### వక్ఫ్ భూముల విషయంలో గొడవలు – తండ్రీకుమారులు సహా తొమ్మిదిమంది అరెస్టు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని నగరంలో ఈ నెల 23న న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్‌ను కారుతో ఢీకొట్టి హత్య చేసిన ఘటనకు దశాబ్దాల నాటి పగ కారణమని పోలీసులు తేల్చారు. అదను కోసం ఎదురు చూసిన నిందితులు సుపారీ ముఠాతో ఒప్పందం చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ కేసులో 10 మంది హస్తం ఉన్నట్లు తేల్చగా తండ్రీకుమారులతో సహా 9 మందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.10.10 లక్షల నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం జాయింట్ సీపీ శ్వేత, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు, అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు సైదులు, మహేశ్, వెంకటేశ్, రాఘవేంద్ర, సైదాబాబు, యాదేంద్రతో కలసి సీపీ సజ్జనర్ మీడియాకు వెల్లడించారు.

**ఐదు నెలల ప్రణాళిక..**

హైదరాబాద్‌కు చెందిన మహబూబ్ ఆలంఖాన్ (90), ముజాహిద్ ఆలంఖాన్ తండ్రీకుమారులు. వీరికి మలక్‌పేట్, లక్డీకాపుల్‌లోని వక్ఫ్ భూముల విషయంలో రెడ్‌హిల్స్ శాంతినగర్‌లోని వక్ఫ్ బోర్డు ప్యానల్ న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్‌తో దశాబ్దాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఇరువైపులా పోలీస్‌స్టేషన్లలో పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదయ్యాయి. ఈ భూములకు సంబంధించి సివిల్, హైకోర్టుల్లో కేసులు కొనసాగుతున్నాయి. గతేడాది నుంచి గొడవలు తారస్థాయికి చేరుకున్నాయి. దీంతో ఎలాగైనా న్యాయవాదిని అడ్డు తొలగించుకోవాలని తండ్రీకుమారులు నిర్ణయానికి వచ్చారు. తమతో సన్నిహితంగా మెలిగే హసన్ అలీ, మునీర్‌లకు రూ.15 లక్షలు సుపారీగా ఇచ్చారు. వీరిద్దరు కిషన్ అనే వ్యక్తితో కలసి హత్యా పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన కారు, ఇతర సామగ్రి సేకరణకు సహకరించారు. జనవరిలో కిషన్, వినయ్, అభిజిత్, విక్రమ్, దీన్‌దయాళ్ కలసి న్యాయవాది ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. రోజూ ఉదయాన్నే ఈతకొలనుకు కారులో వెళ్తాడని గుర్తించారు. దాన్ని అవకాశం చేసుకొని కారుతో ఢీకొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. ఈ నెల 23 తెల్లవారుజామున శాంతినగర్‌లోని న్యాయవాది ఇంటి సమీపానికి చేరుకున్నారు. ఉదయం 5.45 గంటలకు న్యాయవాది బయటకు వచ్చి తన కారు ఎక్కేటపుడు నంబరు ప్లేటు లేని వాహనంలో వెనుకనుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టి 10 మీటర్ల దూరం లాక్కెళ్లారు. తీవ్రగాయాలపాలైన ఆయన్ను కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. న్యాయవాది కుమారుడు ఫర్హాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో హత్య వెనుక 10 మంది ఉన్నట్టు గుర్తించారు. మణిదీప్ అనే వ్యక్తి సహా 9 మందిని అరెస్టు చేయగా దీన్‌దయాళ్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిడి రాలేదని సజ్జనర్ వివరించారు. కీలకమైన కేసును ఛేదించిన సిబ్బందిని సీపీ అభినందించారు.

## లారీ ఢీకొని ముగ్గురి దుర్మరణం



**కొత్తకోట, విశ్వం వాయిస్ న్యూస్ :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఎస్సై శివానంద్‌గౌడ్ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర జిల్లా బాగేపల్లి తాలూకా నుంచి మధ్యాహ్నం రవి అనే వ్యక్తి బొలెరో వాహనంలో కొత్తిమీర కట్టలను తీసుకొని హైదరాబాద్‌కు బయలుదేరారు. కొత్తిమీర విక్రయించిన డబ్బులను తీసుకునేందుకు అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని నేసేవీధికి చెందిన జగదీశ్ (21) వాహనంలో ఎక్కారు. ముమ్మళ్లపల్లి సమీపంలో రాత్రి 10.30 గంటలకు వాహన టైరు పేలిపోయింది. మరో టైరు లేకపోవడంతో వారు అక్కడే ఉన్నారు. బాగేపల్లికి చెందిన రాజశేఖర్ (34), శివరాజు (33) మరో బొలెరో వాహనంలో హైదరాబాద్ వెళ్తున్నారు. అర్ధరాత్రి దాటాక 2 గంటలకు మరమ్మతులకు గురైన వాహనం చూసి ఆగారు. జగదీశ్, రాజశేఖర్, శివరాజు పేలిపోయిన టైరును పరిశీలిస్తుండగా రవి వాహనంలో కూర్చున్నారు. ఈ సమయంలో కర్నూలు వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ.. పేలిపోయిన టైరును పరిశీలిస్తున్న ముగ్గురినీ ఢీకొట్టింది. రాజశేఖర్‌పై నుంచి వెళ్లింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన జగదీశ్, శివరాజును వనపర్తి జిల్లా ఆసుపత్రికి, అటు నుంచి హైదరాబాద్ తీసుకెళ్తుండగా.. మృతి చెందారు. రవికి గాయాలయ్యాయి. జగదీశ్ రోజూ బళ్లారి వెళ్తుంటారు. గురువారం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన బాలకృష్ణ రాకపోవడంతో ఆయన స్థానంలో వచ్చి మృత్యు ఒడిలోకి చేరుకున్నారు.

### గుంటూరు జీజీహెచ్ భవనంపై నుంచి


## దూకి రోగి ఆత్మహత్య




**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** జీజీహెచ్ భవనంపై నుంచి దూకి రోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుంటూరులో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఉండి గ్రామానికి చెందిన చెన్నంశెట్టి శ్రీనివాస్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఈనెల 23న ఆసుపత్రిలో చేరారు. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన శ్రీనివాస్ ఆసుపత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ తాపీ మేస్త్రీగా జీవనం సాగించే వాడని, అతని భార్యత కొంత కాలం క్రితం మరణించినట్టు సమాచారం.

### హైదరాబాద్-విజయవాడ

## రహదారిపై బస్సు దగ్ధం



**చిట్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఓ ప్రైవేటు బస్సు దగ్ధమైంది. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న బస్సులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, క్లీనర్ వెంటనే బస్సును నిలిపేసి ప్రయాణికులను కిందకి దింపారు. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. అందరూ సురక్షితంగా బయటపడినప్పటికీ.. లగేజీ మొత్తం పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.


## రూ.9 లక్షలు డిమాండ్..

### ఏసీబీకి చిక్కిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆర్ఐ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** లంచం కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. సైబర్ మోసం కేసులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు ఓ వ్యక్తిని ఆయన రూ.9 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి నుంచి ఇప్పటికే రూ.5 లక్షలు నగదు తీసుకున్నారు. మిగిలిన రూ.4 లక్షల కోసం బెదిరింపులకు పాల్పడినట్లు ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలోనే లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఇంట్లో సోదాలు నిర్వహించారు. రూ.13 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, స్థిరాస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

## మంత్రాలయం వద్ద తుంగభద్రలో ఐదుగురు గల్లంతు



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారు. కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. గల్లంతైన వారిని ఉరవకొండకు చెందిన సంధ్య (22), హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర (5), సతీశ్ (35), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. వీరంతా బంధువుల ఇంట్లో సత్యనారాయణ వ్రతం కోసం వచ్చారు. అనంతరం ఈత కోసం నదిలోకి దిగి.. లోతు అంచనా వేయలేక గల్లంతయ్యారు. వీరి కోసం పోలీసులు, మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు.

# పౌష్టికాహార భద్రత కోసం బయోఫోర్టిఫైడ్ రకాల పంటలు..


### కిసాన్ వాయిస్

### రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించిన ఐసీఏఆర్

భారతదేశం వ్యవసాయాధారిత దేశం. అయితే రకరకాల అననుకూల పరిస్థితులు.. వ్యవసాయం నష్టాలనే మిగులుస్తుండడం... చీడపీడలు, తెగుళ్లు.. సకాలంలో వానలు కురవకపోవడం.. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ముంచెత్తడం.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం... ఇలాంటి అననుకూల పరిస్థితులతో రైతులు వ్యవసాయం నుంచి తిరుగుముఖం పడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అందుబాటులోకి తెస్తున్నాయి. అందులో భాగంగానే **nutritional security** కోసం కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా **biofortified varieties** పంటలను పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు **ICAR** రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి **Kailash Choudhary** మంగళవారం లోక్‌సభలో తెలిపారు.

**ఆ రెండు కార్యక్రమాలు ఏంటంటే..**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ రెండు కార్యక్రమాలను రూపొందించింది : న్యూట్రి–సెన్సిటివ్ అగ్రికల్చరల్ రిసోర్సెస్ అండ్ ఇన్నోవేషన్స్, వ్యవసాయంలో విలువ జోడింపు, సాంకేతికత ఇంక్యుబేషన్ సెంటర్లు (వాటికా). వ్యవసాయంలో మహిళలపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద, **ICAR** "పోషకాహార భద్రత కోసం స్థిరమైన విధానాలు", "పోషక భద్రత వ్యవసాయ కుటుంబాల ఆరోగ్య ప్రమోషన్" వంటి కార్యక్రమాలను కూడా అమలు చేస్తోంది. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో, వ్యవసాయాభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కార్యక్రమాలలో భాగంగా పాఠశాలలు,



సంఘాలలో న్యూట్రి–గార్డెన్‌లను నిర్మించామని, అక్కడ పోషకాహార విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.

**రకరకాల పంటలు..**


ఇంకా దీనిమీద మంత్రి సమాచారం ఇస్తూ.. **ICAR** వరి, గోధుమ, మొక్కజొన్న, మినుములు, కందులు, వేరుశెనగ, లిన్సీడ్, ఆవాలు, సోయాబీన్‌లలో 79 పోషకాలు అధికంగా ఉండే బయోఫోర్టిఫైడ్ రకాలను అభివృద్ధి చేసింది అని తెలిపారు. కాలీఫ్లవర్, బంగాళదుంప, చిలగడదుంప, గ్రేటర్ యామ్, దానిమ్మ, అదనంగా ఎనిమిది బయోఫోర్టిఫైడ్ ఉద్యాన పంటల రకాలు, వివిధ మాస్ కమ్యూనికేషన్ మాధ్యమాలను కలుపుకొని శిక్షణలు, ప్రదర్శనల ద్వారా రైతులలో ప్రాచుర్యం పొందుతున్నాయి. ఐరన్, జింక్, కాల్షియం, ప్రొటీన్, విటమిన్ సి, ప్రొవిటమిన్ ఎ, ఒలేయిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన ఖనిజాలు ఈ సాగులో మెరుగయ్యాయని మంత్రి అభిప్రాయంగా చెప్పుకొచ్చారు..

**ICAR గురించి...**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అనేది భారతదేశంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను సమన్వయం చేసే స్వయం–పాలన సంస్థ. ఇది వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖకు నివేదిస్తుంది. దీని అధ్యక్షుడు కేంద్ర వ్యవసాయ మంత్రి. ఇది ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన వ్యవసాయ పరిశోధన, బోధనా సంస్థల నెట్‌వర్క్. **NARI** కార్యక్రమం పోషకాహార భద్రతను పెంపొందించడానికి వ్యవసాయాన్ని పోషకాహారం, న్యూట్రి–స్మార్ట్ గ్రామాలతో అనుసంధానం చేస్తూ కుటుంబ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ


ఆదివారం, 31 మే, 2026




www.viswamvoice.com

# భానుడు భగ భగ... కరెంటు అధికారులు[తో] పగ పగ...

## అధికారులు శాంతించేందుకు భానుడు సహకారం...



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మూడు కాలాల్లోనూ 24/7 వలె ప్రభుత్వ పాలకులు, అధికారులు అప్రమత్తతతో బాధ్యతగా మెలగవలసిన ఈ ప్రస్తుత కాలంలో చూద్దాం చేద్దాం అనే రీతిలో ఉండిపోయి ఉద్యోగ, పాలకులు కర్తవ్య ధర్మాలను పాటించడంలేదు. వర్షాభావ ప్రభావం వల్ల రైతులకు ఎటువంటి అసౌకర్యం, నష్టం కలగకుండా వ్యవసాయ శాఖా పాలకులు, అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవడంలో అప్రమత్తతై ఉండాలి, శీతాకాలంలో అనాశ్రయులకు ఆశ్రయం కలిగించి సపోర్టుగా నిలబడటం వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారిస్తుంది. వేసవిలో విద్యుత్ వినియోగం అధికమౌతుందని ముందుగా గ్రహించి అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లను పెంచుకోవడం, ఉన్న వాటిలో కెపాసిటీని పెంచడం వంటి చర్యలు తీసుకోవాలి, కానీ మండపేట విద్యుత్ అధికారులు మాత్రం అధికార పాలకులకు చెప్పకనే చెప్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు నివాసముంటున్న పాటిమీద ఏరియా, ఆనంద్ నగర్ ల యందు ఉన్న కరెంటు ట్రాన్స్ఫార్మర్ లకు వెదురుమూడు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల వినియోగదారుల వాడకాన్ని ఇక్కడ కలపడంతో విద్యుత్ సరిపోక ఒక్కొక్కసారి హై, లో ఓల్టేజి తో ఫ్యాన్లు, లైట్లు, రిఫ్రిజిరేటర్, మోటార్లు, ఎయిర్ కూలర్ వంటివి అర్ధరాత్రి సమయంలో పేలిపోయి కొద్దిపాటి మంటలు రావడంతో మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురై ఇంట్లోంచి బయటకు రావలసిన పరిస్థితిని తీసుకువస్తూ తెలియపర్చుతున్నట్లుంది వ్యవహారం. అదేరీతిలో ఏడిద సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల విద్యుత్ వినియోగాన్ని విజయలక్ష్మి నగర్, వీరభద్రాపురం ఏరియాలలో కలపడం వల్ల కూడా మే నెలంతా ప్రజలు చాలా తీవ్రమైన అసంతృప్తికి గురైయ్యారు. ఇలాంటి పరిస్థితిలో ఏదైనా పిర్యాదు వస్తే సంబంధిత ట్రాన్స్ఫార్మర్ పరిధిలో ఉన్న విద్యుత్ నిలుపుదల చేసి పరిష్కరించి పునరుద్ధించాలి, కానీ ఇక్కడ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు లైన్ మెన్స్ కు క్లిష్ట పరిస్థితే ఎదురవుతుందనే చెప్పాలి. విద్యుత్ ని నిలుపుదల చేసి లోడ్ ఎక్కువకావడం చేత పడిపోయిన గెడర్ లను పునరుద్ధించి వినియోగం ఎక్కువ ఉన్న లైన్స్ నుంచి కొన్నింటిని వేరే లైన్స్ ఫేజ్ లకి మార్చే క్రమంలో 20 నిమషాలు కూడా వేడి తీవ్రతకు ఇంటిలో ఉండలేక గగ్గోలు పెడుతూ రిపేరు చేస్తున్న వారిపై స్థానిక ప్రజానీకం తీవ్రమైన ఒత్తిడిని తీసుకురావడంతో చేసేదిలేక లైన్ మెన్స్ విద్యుత్ ను నిలుపుదల చేయకుండా వారి ప్రాణాలు పణంగా పెట్టి రిపేరు చేయడం జరుగుతుంది. రిపేరు పూర్తైన వెంటనే లోఓల్టేజి ఒక్కసారిగా సప్లై అందుకోవడం వల్ల నివాసాలలో ఉండే ఎలక్ట్రికల్ పరికరాలు షాక్ సర్క్యూట్ కి గురై పాడవుతున్నాయి. కలసి ఉంటే కలదు సుఖం అనే పెద్దల మాట చద్దన్నపు మూటవంటిది కనుక ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు సౌకర్యవంతమైన ముందస్తు చర్యలతో ప్రణాళికా బద్ధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కూడా అర్ధంచేసుకుని సహకరిస్తే అందరికీ బాగుంటుందని గ్రహించాలి.

మహిళల స్వయం ఉపాధికి

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండ

## ఉచిత శిక్షణ, రుణాలతో ఉపాధి కల్పన



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం ఉపాధి ద్వారా ఆత్మవిశ్వాసంతో జీవించాలనే లక్ష్యంతో 'సత్యం వాసంశెట్టి ఫౌండేషన్' ఆధ్వర్యంలో ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో మహిళా అభ్యుదయ వేదిక ఉపాధి అవగాహన సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఒక అడుగు ముందుకు వేస్తే మహిళలకు ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణలు, బ్యాంకు రుణాల సదుపాయం కల్పించి అండగా నిలుస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. రామచంద్రపురం నియోజకవర్గం లోని పేద, నిరుపేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ పేర్లను నమోదు చేసుకుంటే వివిధ వృత్తి నైపుణ్యాల్లో ఉచిత శిక్షణలు అందించి వ్యాపారం ప్రారంభించే ఆలోచన నుంచి పరిశ్రమ స్థాపన వరకు ప్రతి దశలోనూ మార్గదర్శకత్వం వహిస్తూ ఆర్థిక సహాయం బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా ఫౌండేషన్ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. అమరావతి నుంచి మంత్రి వాసంశెట్టి సుభాష్ సెల్ఫోన్ ద్వారా సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. మహిళల ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు "మహిళా అడ్డా" అనే వినూత్న కాన్సెప్ట్‌తో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా నిరుపయోగంగా ఉన్న పాత భవనాలు, సినిమా హాళ్లను మహిళల స్వయం ఉపాధి కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. వివాహాలు, పుట్టినరోజులు తదితర శుభకార్యాలకు అవసరమైన డెకరేషన్, క్యాటరింగ్ సేవలు అందించేలా శిక్షణ ఇవ్వడంతో పాటు, వారు ఎంచుకున్న వ్యాపారాన్ని ఇంటి వద్ద నుంచే నిర్వహించుకునేలా అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి సోదరి శ్రీ సత్య మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు మంత్రి సుభాష్ ప్రత్యేక కృషి చేస్తున్నారని ఆమె వివరించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎంపీడీవో పద్మజ్యోతి మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పెంకే సాంబశివరావు, ఏఎంసీ డైరెక్టర్లు ఖండవల్లి శ్రీనివాసరావు, వళ్ళ ద్రాక్షాయని అర్జునరావు, మేడిశెట్టి విజయభాస్కర్, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కో-క్లస్టర్ ఇన్‌చార్జి కొండలరావు, పితాని వీరభద్రరావు, మహిళా నాయకురాలు వయిట్ల గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ కుటుంబానికి

# టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పరామర్శ

## గాయపడిన దుర్గాభవానికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులకు మంత్రి సుభాష్ ఆదేశాలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం సమీపంలోని ఆదివారపుపేట నుంచి వెల్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో శనివారం జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో సీనియర్ పాత్రికేయుడు బొమ్మ ప్రభాకర్ సోదరుడు బొమ్మ సూర్య వీర వెంకట నాగ కృష్ణమూర్తి మృతి చెందడం పట్ల కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి ఘటనాస్థలంలోనే మృతి చెందగా, ఆయన సతీమణి దుర్గాభవాని తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న వెంటనే వాసంశెట్టి సత్యం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి చేరుకుని భౌతికకాయాన్ని దర్శించి, సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కృష్ణమూర్తి అకాల మరణం బాధాకరమని, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గాభవానికి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చరవాణి ద్వారా ఆసుపత్రి అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం వైద్యులను అడిగి తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వాసంశెట్టి సత్యం వెంట పలువురు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉండి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మృతుడు కృష్ణమూర్తికి నివాళులర్పించి, కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వైయస్సార్ యువజన విభాగం ఆధ్వర్యంలో

# కలెక్టరేట్ వద్ద నిరసన

## జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి వీర్రాజు పిలుపు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వైయస్సార్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఏర్పడిన అవకతవకలపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద జూన్ 1న సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైయస్సార్ పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల అర్హత, ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం, నియామక ప్రక్రియను వివాదాస్పదంగా మార్చి వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని ఫలితాలు, ఎంపిక విధానంలో జరిగిన అన్యాయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో పార్టీ అధినేత వైయస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు ఆదేశాలతో ఈ నిరసన కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ మండల, గ్రామ స్థాయి నాయకులు, యువజన విభాగ నాయకులు, విద్యార్థి విభాగ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా కార్యకర్తలు, నిరుద్యోగ యువత, పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆలమూరులో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం





**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ మరో సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలమూరులో 28 మంది లబ్ధిదారులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ట్రస్ట్ చైర్మన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బూసి విద్యాప్రసన్న నివాసంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆలమూరు ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కళ్లజోళ్లు అందజేశారు. కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో బీటెక్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి శశాంక్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉన్నత విద్యను అభ్యసిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం యువతకు ఆదర్శమని బూసి విద్యాప్రసన్న కొనియాడారు. సమాజ అభివృద్ధికి విద్యతో పాటు సేవా దృక్పథం కూడా అవసరమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ భవిష్యత్తులో కూడా పేదల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కళ్లజోళ్లు అందుకున్న లబ్ధిదారులు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమకు ఎంతో ఉపయోగపడే సహాయం అందిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిరి వెర్రియ్య, బూసి చిట్టి కుమార్, దిడ్డి రాము, సుఖి రాజుబాబు, న్యాయవాదులు కె.ధనరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బురదకాలువ పనులు తక్షణమే చేపట్టండి : బత్తుల

## రైతుల కోసం అవసరమైతే సొంత డబ్బులు ఇస్తా - జెసి దృష్టికి బురదకాలువ సమస్య




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీరంగపట్నం బురదకాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి రైతులు ముందుకు వచ్చి పనులను తక్షణమే ప్రారంభించాలని అవసరమైతే రైతుల కోసం తన జేబులో డబ్బునైనా ఇస్తానని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో శ్రీరంగపట్నం రైతులు బత్తులను కలిసి,బురదకాలువతో ప్రతి ఏడాది తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బత్తుల స్పందిస్తూ బురదకాలువ వల్ల ప్రతి ఏడాది రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, కాలువలో పూడికలు పేరుకుపోవడం వల్ల పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని జెసి మేఘ స్వరూప్ దృష్టికి తీసుకు వెళ్ళానన్నారు.బురదకాలువ సమస్య తీవ్రతను గుర్తించామని, వర్షాకాలంలో పంటలు ప్రారంభం కాకముందే ముందస్తు జాగ్రత్తగా కాలువ మరమ్మత్తులు వెంటనే ప్రారంభించాలని, ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోయినా అవసరం అయితే తన జేబులో డబ్బులు అయినా ఇస్తానని, పనులు వెంటనే ప్రారంభించాలని రైతులకు తెలిపారు. అదేవిధంగా పంటలు చేతికి వచ్చే సమయానికి, భారీ వర్షాల వల్ల కాలువ పొంగిపొర్లకుండా, రైతులకు ఎలాంటి పంట నష్టం వాటిల్లకుండా ముందస్తుగానే కాలువ గట్లను బలపరచడం, మరమ్మత్తులు చేయడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బురదకాలువ సమస్యపై స్పందించి,ముందస్తు చర్యలకు ఆదేశాలు జారీ చేసినందుకు శాసనసభ్యులు బత్తులకు,శ్రీరంగపట్నం రైతాంగమంతా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, తన్నీరు తాతాజీ, అడపా శ్రీనివాస్, యర్రంశెట్టి పోలారావు. శ్రీరంగపట్నం రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన అధికారులకు ఘన సన్మానం

## ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించిన ఎస్పీ నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులు కె. ఆంజనేయులు,సబ్ ఇన్స్పెక్టర్ (జిల్లా స్పెషల్ బ్రాంచ్), ఆర్.డి. సోమేశ్వరరావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (జిల్లా స్పెషల్ బ్రాంచ్) కొప్పిశెట్టి రామకృష్ణ, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఉండ్రాజవరం), చిట్టిబొమ్మ వరప్రసాద్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏ.ఏ.ఓ. జిల్లా పోలీసు కార్యాలయం)ను జిల్లా ఎస్పీడి. నరసింహ కిషోర్ సాలువ కప్పి పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీరు పోలీస్ డిపార్ట్మెంట్ కు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. వారి భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి (ఎస్.బి) బి. రామకృష్ణ, డి.ఎస్.పి (ఏ.ఆర్) టి.ఆర్.కె రవి కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### 216 జాతీయ రహదారి విద్యుత్ టవర్ల

# పునర్నిర్మాణానికి భూసేకరణ వేగవంతం

### భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.1 కోటి పరిహారం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** 216 జాతీయ రహదారి వెంబడి విద్యుత్ టవర్ల ఎత్తు పెంపు, పునర్నిర్మాణం కోసం భూములు ఇచ్చిన భూ యజమానులకు ప్రభుత్వ ధర కంటే 200 శాతం అధిక పరిహారం అందజేస్తూ, ఎకరాకు రూ.1 కోటి చొప్పున, సెంటు భూమి ధరను రూ.1 లక్షగా నిర్ణయించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వైభోం నైదియావేడి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ, ట్రాన్స్‌కో అధికారులు, భూములు ఇచ్చిన భూ యజమానులతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోనసీమ జిల్లా పరిధిలోని 216 జాతీయ రహదారి వెంబడి రాజోలు, మామిడికుదురు మండలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను పునర్నిర్మించేందుకు జిల్లా యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం 6 మీటర్ల ఎత్తులో ఉన్న 130 కేవీ విద్యుత్ లైన్లకు సంబంధించిన 8 టవర్లను తొలగించి, వాటి స్థానంలో 12 మీటర్ల ఎత్తు గల నూతన టవర్లు నిర్మించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియపై ఉన్నతస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ట్రాన్స్‌కో ప్రతినిధులు, భూ యజమానులతో కలిసి ఈ కీలక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజల భద్రత, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. 216 జాతీయ రహదారి విస్తరణ, ఆధునీకరణ పనుల్లో భాగంగా రాజోలు, మామిడికుదురు మండలాల పరిధిలో కేవలం 6 మీటర్ల ఎత్తులో ఉన్న 130 కేవీ విద్యుత్ లైన్లు భవిష్యత్తులో ప్రజల భద్రతకు, రవాణాకు ఆటంకంగా మారే అవకాశం ఉందన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా 8 విద్యుత్ టవర్లను తొలగించి, 12 మీటర్ల ఎత్తు గల కొత్త టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ నూతన టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులు, యజమానులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తోందన్నారు. భూ యజమానుల ప్రయోజనాలను కాపాడాలనే ఉద్దేశంతో సెంటు ధరను రూ.1 లక్షగా నిర్ణయించి పరిహారం చెల్లించేందుకు సంప్రదింపుల కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ, ట్రాన్స్‌కో అధికారులు సమన్వయంతో వ్యవహరించి భూ యజమానులకు చెల్లించాల్సిన పరిహారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని జాతీయ రహదారుల డివిజనల్ ఇంజనీర్ నిక్కీని ఆదేశించారు. అభివృద్ధి పనులకు భూ యజమానులు కూడా సహకరించాలని కోరారు. ఈ ప్రాజెక్టును నిర్దేశిత గడువులో పూర్తి చేసి, ప్రాంతంలో విద్యుత్ సరఫరా భద్రతను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. టవర్ల ఏర్పాటుకు ఉపయోగించిన భూమికే కాకుండా, విద్యుత్ వైర్ల కారిడార్ పరిధిలోని చెట్లు, పంటల నష్టానికి కూడా పరిహారం అందజేయనున్నట్లు వెల్లడించారు. భూ ఆధారిత రైతు కుటుంబాల హక్కులను పరిరక్షిస్తూ అన్ని చట్టపరమైన నిబంధనలను పాటించి, తగిన పరిహారాన్ని సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ప్రాంత అభివృద్ధికి, రహదారి భద్రతకు, విద్యుత్ సరఫరా సామర్థ్య పెంపుకు కీలకమన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ పొలాల మధ్యగా వెళ్తున్న విద్యుత్ లైన్లను ఒక వైపుకు మార్చాలని కోరగా, సాంకేతిక అంశాలను పరిశీలించి సాధ్యాసాధ్యాలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టవర్ల ఏర్పాటుకు మొత్తం 39 సెంట్ల భూమిని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీవో జి. మమ్మీ, జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసరావు, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సుబ్బరాజు, రాజోలు తహసీల్దార్ భాస్కరరావు, మామిడికుదురు ఉప తహసీల్దార్ అబ్రహం, సంబంధిత మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

### మోడరన్ విద్యాసంస్థల ర్యాంకర్లకు

# సీఎం చంద్రబాబు అభినందనలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణానికి చెందిన మోడరన్ విద్యాసంస్థలకు చెందిన అకాడమిక్ ర్యాం కర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన సీనియర్ ఇంటర్ విద్యార్థి పి.వి.వి.ఎస్.ఎస్.ఎస్. సంజన, జూనియర్ ఇంటర్ విద్యార్థి ఎస్. దిలీప్ శ్రీ వీర వెంకట్, టెన్త్ విద్యార్థి ఎన్. ప్రశంసలను సీఎం చంద్రబాబు అభినందించడం తమ సంస్థకు దక్కిన గొప్ప గౌరవమని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దుతున్న మోడరన్ విద్యాసంస్థల కృషిని ఈ సందర్భంగా సీఎం ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్‌తో మోడరన్ విద్యాసంస్థలకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని 2011లో డాక్టర్ జి.వి.రావుకు అందజేసిన 'స్వరవేద' పురస్కార క్షణాలను సీఎం గుర్తు చేసుకున్నారని, రాబోయే విద్యా సంవత్సరంలోనూ తమ విద్యాసంస్థలు మరింతగా అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సీఎం ఆకాంక్షించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీ మోడరన్ అకాడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి పాల్గొన్నారు.

# సుబ్బారెడ్డికి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తాడేపల్లిగూడెంకి చెందిన కర్రి సుబ్బారెడ్డికి 10 సంవత్సరాల క్రితం షుగర్ వచ్చింది. ఇతనికి ఒక కాలుకి ముళ్ళు గుచ్చుకొని ఇన్ఫెక్షన్ అయ్యి ఒక కాలు తీసేసారు. మళ్లీ రెండో కాలు కూడా ఇన్ఫెక్షన్ వచ్చి రెండో కాలు కూడా తీసేయాలి అన్నారు. రెండు లక్షల వరకు ఖర్చు అవుతాదని డాక్టర్ చెప్పారు.వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా సంస్థ నుంచి 10000 రూపాయలు సంస్థ సభ్యులు కే పావని 1000 రూపాయలు మొత్తం 11000రూపాయలు సుబ్బారెడ్డి భార్య చేతికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. దీనికి సహకరిస్తున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను

# అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**జనసేన నాయకుల ఫిర్యాదు**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ఉద్యమకారుల పేరుతో కొందరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని అవమానిస్తూ, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ అమలాపురం జనసేన పార్టీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జనసేన నాయకుల వివరాల ప్రకారం, ఇటీవల హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల పేరుతో నిర్వహించిన మీడియా సమావేశంలో కొందరు వ్యక్తులు ప్రొఫెసర్ నాగేశ్వర్ మద్దతుదారులుగా తమను పరిచయం చేసుకుంటూ, ప్రాంతీయ విభేదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని అవమానించే చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా ఉందని జనసేన నాయకులు పేర్కొన్నారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, చిత్రపటాల అవమానాలు, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను ఏ విధంగానూ సమర్థించలేమన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రాంతీయ విద్వేషాలను ప్రేరేపించిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగ సతీష్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కల్వకొలను తాతాజీ, మాజీ కౌన్సిలర్ యేడిద శ్రీను, సుధా చిన్న, గండి స్వామి, డీఎస్ఎన్ కుమార్, మోటూరి సూర్యకిరణ్‌తో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

### రామచంద్రపురంలో విజయవంతమైన మహిళా అభ్యుదయ వేదిక సమావేశం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి కల్పన, సాధికారతే లక్ష్యంగా రామచంద్రపురం టౌన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మహిళా అభ్యుదయ వేదిక అవగాహన సమావేశానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అమరావతి నుంచి ఫోన్ ద్వారా హాజరై తన సందేశాన్ని అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా, యజమానులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలు, వితంతువులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇప్పటికే ఉచిత శిక్షణలు (జ్యూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, సోప్ మేకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ తదితర) అందించామని, వారికి రుణ సదుపాయాలు కల్పించి చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు సహకరిస్తామని పేర్కొన్నారు. జూన్ 17 నాటికి 200 నుంచి 300 మంది మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. మహిళా సాధికారతే తమ ప్రధాన లక్ష్యమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం స్పష్టం చేశారు. తన కుమార్తె శ్రీ సత్య సహకారంతో మంత్రి ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని పెట్టుబడి పెట్టలేని మహిళలకు ఫౌండేషన్ ద్వారా పూర్తి అండదండలు మార్గదర్శకత్వం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి వద్ద నుంచే కుటీర పరిశ్రమలు స్థాపించుకునేలా ప్రోత్సహిస్తూ, వారు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ముఖ్యంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డిజిటల్ ప్రింటింగ్, సానిటరీ ప్యాడ్స్, మైక్రో గ్రీన్స్, డైరీ ఫార్మింగ్, ఫోటోగ్రఫీ, పౌల్ట్రీ, క్రాబ్ ఫార్మింగ్, వాటర్ బాటిల్స్ ప్యాకింగ్, పేపర్ బ్యాగ్స్ తయారీ, కూరగాయల సాగు తదితర రంగాల్లో శిక్షణ ఇచ్చి వ్యాపార అవకాశాలు కల్పిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రపురం ఆర్డీవో సరళావతి మాట్లాడుతూ మహిళల జీవితాల్లో వెలుగులు నింపేలా మంత్రి సుభాష్, సత్యం ఫౌండేషన్ చేస్తున్న కృషి ఆదర్శనీయమని, ఇందుకు రెవెన్యూ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా మెప్మా ద్వారా రుణాల మంజూరుకు ప్రభుత్వపరంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.మంత్రి సుభాష్ సహోదరి శ్రీ సత్య మాట్లాడుతూరాజకీయాలకు అతీతంగా మహిళల ఉపాధి శిక్షణ కార్యక్రమాలను ఒక నిరంతర ప్రక్రియగా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మహిళలకు సహాయం అందించేందుకు ఇప్పటికే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని త్వరలోనే పలు స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ, ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, గరికపాటి సూర్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు వజ్రపు రాజేశ్వరి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### గంజాయి, డ్రగ్స్ తీసుకుంటే

# క్షణాల్లో దొరికిపోతారు

### సరికొత్త డిటెక్షన్ కిట్లతో పోలీసుల తనిఖీలు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా పోలీసు శాఖ అత్యంత కఠినమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు సేవించే వారిని, సరఫరా చేసే వారిని నిమిషాల వ్యవధిలో గుర్తించే అత్యాధునిక సాంకేతికతను జిల్లా పోలీసులు రంగంలోకి దించారు. ఇందులో భాగంగా శుక్రవారం అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, అమలాపురం టౌన్ సీఐ వీరబాబు, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్, ముమ్మిడివరం సీఐ మోహన్, ఎస్బీ సీఐ పుల్లారావు పర్యవేక్షణలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది ఈ సోదాల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా పలువురు అనుమానిత వ్యక్తులను నిలిపి, వారికి అత్యాధునిక గంజాయి/డ్రగ్ డిటెక్షన్ కిట్లు (బయో చెక్ కిట్లు) ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను ఈ కిట్లతో పరీక్షించగా కేవలం రెండు నిమిషాల్లోనే ఫలితాలు వెల్లడయ్యాయి. అకస్మాత్తుగా నిర్వహించిన ఈ తనిఖీల్లో మొత్తం 11 మందికి మత్తు పదార్థాలు సేవించినట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మత్తుకు బానిసలైన ఆ 11 మందిలో మార్పు తీసుకురావడానికి వారిని వెంటనే డీ-అడిక్షన్ సెంటర్ (వ్యసన విముక్తి కేంద్రం)లో చేర్పించారు. అలాగే వారిపై చట్టప్రకారం తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలను కూడా పోలీసు శాఖ చేపడుతోంది. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల మూలాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఇకపై గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సేవించి తప్పించుకోవడం సాధ్యం కాదన్నారు. అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా అనుమానితుల మూత్రం లేదా లాలాజల నమూనాలను పరీక్షించి కేవలం రెండు నిమిషాల్లోనే వారు గంజాయితో పాటు 11 రకాల ఇతర మత్తు పదార్థాలు తీసుకున్నారా లేదా అనే విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించవచ్చని పేర్కొన్నారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును పాడుచేస్తున్న ఇటువంటి సామాజిక రుగ్మతలపై పోలీసు శాఖ ఉక్కుపాదం కొనసాగుతుందని, జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా, తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో మత్తుకు బానిసలైన వారిని గుర్తించి కౌన్సెలింగ్ అందించి, డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. అత్యాధునిక పరికరాల వినియోగంతో నిందితులను సులభంగా గుర్తించి పట్టుకునే అవకాశం లభించిందని, రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని ఎస్పీ తెలిపారు.

### సమిష్టి కృషితో డిజిటల్

# మహానాడు విజయవంతం

**వాసంశెట్టి సత్యం**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 27, 28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డిజిటల్ మహానాడు విజయవంతం కావడంతో రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో డిజిటల్ మహానాడు అత్యంత వైభవంగా జరగడంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో నియోజకవర్గంలోని 10 క్లస్టర్ల నుంచి అంచనాలకు మించి ఎమహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన పలువురు నాయకులు, కార్యకర్తలను ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ ఆధ్వర్యంలో వాసంశెట్టి సత్యంను కూడా పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్-1 ఇన్‌చార్జి మేడిశెట్టి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కట్టా నాగేశ్వరరావు, దంగేటి గౌరీశంకర్, నారపురెడ్డి బలరాం, గడి గోవిందు, గడి జగన్, పొనకల చంటి, అల్లం శ్రీనివాస్, బలక్ష్మి, వజ్రపు రాజేశ్వరి, దోమలపాటి విజయలక్ష్మి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బడి పిలుస్తుంది రా..



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బడి పిలుస్తుంది రా కార్యక్రమంలో భాగంగా ఆలమూరు మండల విద్యాశాఖ అధికారి వన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అప్పాజీ ఆధ్వర్యంలో మండల పరిధిలో పినపళ్ళ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ బాల బాలికలకు ఎన్సిసి సౌకర్యం కంప్యూటర్ ల్యాబ్ పాల్ ల్యాబ్ ఆటల పోటీలు మూడు జతల యూనిఫాం టై బెల్టు బూట్లు బ్యాగ్ టెస్ట్ బుక్స్ డైరీలు నోట్సులు మంచి పౌష్టికాహారం కలిగిన భోజనం వారానికి 5 రోజులు గుడ్డు రాగి జావా చిక్కిలు సదుపాయాలు కల్పిస్తున్న చదివించి మీ డబ్బులు ఆదా చేసుకోవాలని అత్యధిక మార్కులతో మీ పిల్లలను చదివించి ఉత్తీర్ణత సాధించే బాధ్యత మేము తీసుకుంటామని ఉపాధ్యాయులు ఇంటికి తిరిగి ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పి.సత్యనారాయణ కె.సుజాత, బి.శిరీష, ఎన్.వీరాంజనేయులు, గోవిందరాజు సిఆర్ఎంటి వై.అపర్ణ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యువత తప్పనిసరిగా 'మన్ కీ బాత్' వీక్షించాలి



**నాగిరెడ్డి సతీష్ రావు**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత తప్పనిసరిగా వీక్షించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు పిలుపునిచ్చారు. ఆయన స్థానిక ప్లే గ్రౌండ్‌కు వెళ్లి అక్కడి యువతతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఈ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో నేరుగా మమేకమవుతారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, సామాజిక కార్యక్రమాలు, వాటిలో ప్రజల భాగస్వామ్యం వంటి కీలక అంశాలను ప్రధాని తరచుగా ప్రస్తావిస్తారని ఆయన వివరించారు. వీటికి అదనంగా.. యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో యువత పోషించాల్సిన ప్రాముఖ్యత గురించి ప్రధాని మోదీ తన ప్రసంగాల ద్వారా ఎంతో స్పష్టంగా దిశానిర్దేశం చేస్తారని, కాబట్టి ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని తప్పక వీక్షించి ప్రయోజనం పొందాలని ఆయన యువతను కోరారు.

# సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు



**కాకినాడ జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** తుని మండలం చామవరం గ్రామంలో జూన్ 1, 2026వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా కలెక్టర్ ఎమ్ఎన్ హరేంధిర ప్రసాద్, ఎంపీ సానా సతీష్ బాబుతో కలిసి ముందస్తు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యవేక్షించారు. ఈ పర్యటనలో భాగంగా సభా వేదిక, ముఖ్యమంత్రి అచ్చట సందర్శించబోవు ఇతర ప్రదేశాలు తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు సమీక్షించారు. బారికేడ్ల నిర్మాణం మరియు ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లను నిశితంగా పరిశీలించి, అధికారులకు తగిన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ (ఏ ఆర్) అడిషనల్ ఎస్పి ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌బిడిఎస్పి కెవివి సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్పి ఏబీజీ తిలక్, సీఐలు, ఎస్సైలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### పవన్ కృషితో రెండు నెలల్లో అందుబాటులోకి

# ఉప్పాడలో స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్

**పెండింగ్ నిధుల విడుదలకు కేంద్రం హామీ - నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గాన్ని విద్యా, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఆయన నిరంతర కృషి ఫలితంగానే ఉప్పాడలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ (ఎస్ఐహెచ్ఎం) మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఉప్పాడలోని ఇన్స్టిట్యూట్ ప్రాంగణాన్ని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సంబంధిత శాఖ అధికారులతో పాటు జనసేన పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. నిర్మాణంలో ఉన్న వివిధ భవనాలు, తరగతి గదులు, పరిపాలనా విభాగం, ప్రయోగశాలలు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఇప్పటికే పొన్నాడలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) ఏర్పాటు కావడం పిఠాపురం నియోజకవర్గ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. అదే విధంగా ఉప్పాడలోని హోటల్ మేనేజ్మెంట్ ఇన్స్టిట్యూట్ కూడా ప్రాంత యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలకు ద్వారాలు తెరవబోతోందని తెలిపారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.12 కోట్ల వ్యయంతో 5.01 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇన్స్టిట్యూట్ నిర్మాణం చేపట్టినట్లు ఎంపీ వివరించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుపై సరైన దృష్టి లేకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదని, నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టును ప్రత్యేకంగా పర్యవేక్షించారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను పలుమార్లు కలిసి ప్రాజెక్టుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయడంతో నిర్మాణ పనులు మళ్లీ వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. గత రెండేళ్లలోనే ప్రాజెక్టు పనులు దాదాపు 98 శాతం పూర్తయ్యాయని, ప్రస్తుతం ఇతర మౌలిక సదుపాయాల కల్పన, అంతర్గత పనులు కోసం అవసరమైన రూ.2 కోట్ల అదనపు నిధుల విడుదలకు ఇటీవల కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని మరోసారి కలిసి విజ్ఞప్తి చేయగా త్వరలోనే పెండింగ్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు. నిధులు విడుదలైన వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి మరో రెండు నెలల్లో విద్యాసంస్థను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, సంబంధిత శాఖ అధికారులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయింపుపై

# హర్షం వ్యక్తం చేసిన తెలుగు మహిళలు

**మహిళా సాధికారతే టీడీపీ లక్ష్యం - తెలుగు మహిళలు మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా సాధికారతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని, మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహిళా రిజర్వేషన్‌కు బలమైన పునాది వేసి, మహిళా సాధికారతకు బాటలు వేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని కాకినాడ సిటీ నియోజకవర్గ మహిళ నాయకులు మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత, సుంకర పావని, కొపనాతి నాగ కుమారి పేర్కొన్నారు. పార్లమెంట్ బిల్లుతో సంబంధం లేకుండా తెలుగుదేశం పార్టీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించటకు మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు తీసుకున్న నిర్ణయంపై శనివారం శాసనసభ్యులు వనమాడి కొండబాబు గారి ఆధ్వర్యంలో బాలాజీ చెరువు సెంటర్ నందు "THANK YOU CM SIR" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని థాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాకినాడ నగర క్లస్టర్ ఇంచార్జ్ మల్లిపూడి నాగ దీపిక మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన పార్టీగా తెలుగుదేశం పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని, మహిళా రిజర్వేషన్లు, మహిళలకు ప్రాధాన్యత పేపర్లు, ప్రకటనలకే పరిమితం కాకుండా వాస్తవ రూపం దాల్చేలా మహానాడులో తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, మహిళలకు రాజకీయ స్వేచ్ఛ, సముచిత స్థానం కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, మహిళలకు గౌరవం, అవకాశాలు, నాయకత్వం కల్పించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి తుమ్మల సునీత మాట్లాడుతూ మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం నుండి సామాజికంగా, రాజకీయంగా ప్రోత్సహించడం వరకు ప్రతి దశలోనూ తెలుగుదేశం పార్టీ పాత్ర ప్రతి ఆడబిడ్డ మర్చిపోలేనిది అని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ మహానాడులో తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని, మహిళలు గృహాలకే పరిమితం కాకుండా ప్రజా సేవలో భాగస్వామ్యులయ్యేందుకు ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ బాటలు వేస్తుందని తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది, తొలి మహిళా స్పీకర్ ను నియమించింది, రాష్ట్రానికి డ్వాక్రా సంఘాలను పరిచయం చేసి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. నగర మహిళ అధ్యక్షురాలు కోపనాతి నాగకుమారి మాట్లాడుతూ 12 లక్షల డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసి, 1.12 కోట్ల మంది మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ అని, మహిళలకే అత్యధికంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తూ, స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, తల్లికి వందనం, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలెండర్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి నాగ దీపిక, సుంకర పావని, తుమ్మల సునీత, కలగా శివరాణి, గుజ్జు దుర్గ, బంగారు సూర్యావతి, కోపనాతి నాగ కుమారి, వడిసెల దాలమ్మ, నల్లూరు తులసి, పలివెల లక్ష్మి, ముత్యాల రాణి, పొంగా సత్య, చింతలపూడి భవాని, కుసుమ కుమారి, వీరంరెడ్డి వెంకటలక్ష్మి, మూగు చిన్ని, బుర్ర అప్పలనరసమ్మ, చెక్క సత్యవతి, బుంగా నూకాలమ్మ, కోడూరి నీలిమ, రామలక్ష్మి, రమాదేవి, రవణమ్మ, జగదాంబ, రమాదేవి, కలగా సువర్ణ, వల్లపు మంగ, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ చెక్కులు పంపిణీ : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు పథకం కింద మంజూరైన చెక్కులను రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు.శనివారం రాజమహేంద్రవరం తన స్వగృహంలో బత్తుల సిఫార్సు మేరకు మంజూరు అయిన చెక్కులను శాసనసభ్యులు బత్తుల చేతుల మీదుగా ఆయా ఆలయ కమిటీసభ్యులుకు అందజేశారు. మధురపూడి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి 4.84 లక్ష రూపాయలు,పాత మునగాలలో శ్రీ విగ్నేశ్వరస్వామి ఆలయానికి 3.17 లక్షల రూపాయలు,కొత్త మునగాలలో శ్రీ విగ్నేశ్వరస్వామి ఆలయానికి 3.34 లక్షల రూపాయల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన,తెలుగుదేశం,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎంపీపీ గొల్లపల్లి అధ్యక్షతన

# మండల సర్వసభ్య సమావేశం



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. గత సమావేశాల్లో లేవనెత్తిన స్థానిక సమస్యలపై ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధికారులను వివరాలు కోరుతూ, పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధిలో అధికారులు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.వచ్చే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు,వ్యవసాయ పరికరాలు సమయానికి అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అలాగే గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మండల పరిధిలో వివిధ శాఖల్లో బదిలీపై వెళ్లుతున్న ఉద్యోగులకు ఈ సమావేశంలో ఘనంగా వీడ్కోలు పలికారు.అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ప్రజాప్రతినిధులు కలిసి ఆత్మీయ స్వాగతం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజలక్ష్మి లక్ష్మణరావు, సాదే లోవరాజు, ఎంపీటీసీలు పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి, బుద్ధ సత్యవతి, కాలారి గిరీష, లింగంపర్తి, ఏలేశ్వరం సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, సూతి బూరయ్యతో పాటు పలువురు మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

**లేబర్ కోడ్ల రద్దు, కనీస వేతనాలపై పోరాటాలకు సిద్ధపడాలని పిలుపు**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సిఐటియు ఏర్పడి 56 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాకినాడ కచేరిపేట నందు లక్ష్మీ దాస్ భవన్ ప్రాంగణంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు నగర కన్వీనర్ మలకా రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి జెండా ఆవిష్కరణ చేసి అనంతరం సిఐటియు వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు బీటీ రణధీవే, పి.రామ్మూర్తి, పర్స సత్యనారాయణ నండూరి ప్రసాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ 1970 మే 30న ఐక్యత పోరాటం నినాదంతో సిఐటియు ఆవిర్భవించి 56 ఏళ్ళు పూర్తి చేసుకుందని, పెట్టుబడిదారీ అనుకూల దోపిడీ విధానాలపై సిఐటియు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, ఇతర కార్మిక సంఘాలతో ఐక్య పోరాటాలు నిర్వహించడంలో సిఐటియు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నూతన ఆర్థిక విధానాలు 1991 ప్రారంభించిన 36 ఏళ్ల అనంతరం దేశం తెరుకోలేని అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రజల సంపద ఆవిరి అయిపోతుందని, ఇదే సమయంలో వేళ్ళ మీద లెక్కపెట్టే బడా పెట్టుబడిదారులైన అదాని, అంబానీల వంటి కొద్దీ మంది సంపద విపరీతంగా కేంద్రీకృతం అవుతుందని, అందుకు 36 ఏళ్లలో పాలించిన పాలక పార్టీల ఆర్థిక విధానాలే కారణమని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు ఈ దోపిడీని మరింత తీవ్రతరం చేయడం కోసమే మోడీ అమలు చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాటాలకు కార్మికులకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కనీస వేతనాన్ని సవరించి 15 ఏళ్లు గడుస్తుందని, ధరలకు అనుగుణంగా ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు దడాల పద్మ, ఎరుబండి చంద్రావతి, చామంతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

# శృంగవరంలో ఘోర రోడ్డు ప్రమాదం - మహిళ మృతి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం శృంగవరం గ్రామ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక తోటికోడళ్లు యలమంచిలి అమ్మాజీ, యలమంచిలి చక్రవేణి బెండపూడిలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లడానికి బస్సు ఎక్కేందుకు శృంగవరం రోడ్డు మీదకు వస్తున్నారు. అదే సమయంలో రౌతులపూడి నుంచి శంఖవరం వైపు అత్యంత వేగంగా వెళుతున్న లారీ వీరిరువురునీ బలంగా ఢీకొట్టడంతో వీరికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో వీరికి చికిత్స, వైద్య సహాయం అందించడానికి స్థానికులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలిస్తుండగా క్షతగాత్రుల్లో ఒకరైన అమ్మాజీ (52) మార్గం మధ్యంలోనే మరణించింది. ఈమెకు భర్త సత్యనారాయణ, వివాహితులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్తతో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అమ్మాజీ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. క్షతగాత్రుల్లో రెండో బాధితురాలు చక్రవేణి పరిస్థితి కూడా విషమంగా ఉంది. దీంతో ఈమెకు అత్యవసర చికిత్సనూ అందిస్తున్నారు. ఈ ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న వెంటనే రౌతులపూడి పోలీసు స్టేషన్ ఎస్ఐ. వెంకటేశ్వర రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

### తుని మండలం ఎర్రకోనేరు సెంటర్‌లో

# అదుపుతప్పిన కాంక్రీట్ మిక్సర్

**ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన**

**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం, జాతీయ రహదారి-16 పరిధిలోని ఎర్రకోనేరు సెంటర్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదుపుతప్పిన కాంక్రీట్ మిలర్ వాహనం రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది.





### అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల బలోపేతానికి

# కేంద్రం కీలక చర్యలు



**కేంద్ర ఆరోగ్యశాఖ సానుకూల స్పందన**
**ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి హర్షం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ఆరోగ్య, పోషణ వ్యవస్థకు వెన్నెముకలుగా పనిచేస్తున్న ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ సదుపాయాల కల్పన, వ్యాధుల ప్రారంభ దశ గుర్తింపు, పోషకాహార అవగాహన, పారదర్శక ప్రోత్సాహక వ్యవస్థలపై తాను లోక్‌సభలో ప్రస్తావించిన అంశాలకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సమగ్ర సమాధానం ఇవ్వడం సంతోషకరమని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఈ ఏడాది మార్చి 13న లోక్‌సభలో రూల్-377 కింద తాను ప్రస్తావించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు పలు కీలక చర్యలు చేపట్టడం అభినందనీయమని పురంధేశ్వరి తెలిపారు. కోవిడ్-19 వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అంకిత భావంతో పనిచేసిన ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం వారి శిక్షణ, సంక్షేమం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడంశుభపరిణామమని పురంధరేశ్వరి అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద నిరంతర నివాస, అనివాస శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, తల్లి-శిశు ఆరోగ్యం, పోషణ, డిజిటల్ హెల్త్, సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలపై సమీకృత శిక్షణ మాడ్యూల్స్ అమలు చేయడం, జిల్లా మరియు బ్లాక్ స్థాయిలలో స్కిల్ ల్యాబ్స్, రిఫ్రెషర్ శిక్షణలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఆమె తెలిపారు. అలాగే డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫార్ములు, వ్యాధుల ప్రారంభ దశ గుర్తింపు, కమ్యూనిటీ భాగస్వామ్యంపై నైపుణ్యాధారిత శిక్షణలు, హెచ్‌బీవైసీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్ సేవలపై ప్రత్యేక శిక్షణలు అందించనున్నట్లు పేర్కొన్నారని చెప్పారు. ఎన్ఐఓఎస్ సహకారంతో ఆశా సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా సర్టిఫికేషన్‌తో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు, మానసిక ఆరోగ్యం, వృద్ధుల సంరక్షణ, అత్యవసర సేవలపై ఈ-లెర్నింగ్ మాడ్యూల్స్, ఆయుష్మాన్ భారత్-పీఎంజేఏవై కవరేజ్, ఆశా ఘర్‌లు, ఆశా అవార్డులు, ఉన్నత విద్య అవకాశాలు వంటి సంక్షేమ చర్యలు కూడా అమలులో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వివరించిందని తెలిపారు. అదేవిధంగా చెల్లింపులు, పని వాతావరణానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్మిత ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా కార్యకర్తల సమస్యలకు వేగంగా పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ చర్యలు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల సేవలకు మరింత గౌరవం తీసుకురావడమే కాకుండా గ్రామీణ భారతదేశ ఆరోగ్య, పోషణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని పురంధరేశ్వరి పేర్కొన్నారు. తాను లోక్‌సభలో ప్రస్తావించిన అంశంపై స్పందించి, సానుకూల చర్యలు చేపట్టిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్‌కు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

### పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో

# సామాన్య ప్రజల జీవితాలు భారం

**ప్రజలు అప్పుల్లో కూరుకుపోతున్నారు - మోదీ మాత్రం అభివృద్ధి కథలు చెబుతున్నాడు!**
**- ప్రజలకోసం త్యాగం చేస్తూ నెలకు ఒక్కరూపాయి జీతం తీసుకోండి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ ప్రజలు పెరుగుతున్న ధరలతో విలవిల్లాడుతుంటే, ప్రధాని మోదీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ మిత్రుల సేవలో మునిగిపోయింది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల జీవితాలను భారంగా మార్చింది. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు ధరల పెరుగుదలతో యువత, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. మోదీ ప్రభుత్వంలో మంత్రులు పార్లమెంట్ సభ్యులు దేశం లోని వివిధ రాష్ట్రాల శాసనసభ్యులు ఎలాంటి ఈ విపత్కర పరిస్థితుల్లో తమ జీత భత్యాలను త్యాగం చెయ్యవలసిన అవసరం ఉన్నది. బీజేపీ తోక పట్టుకుని పోతున్న కూటమి ప్రభుత్వం ఇటీవల మహాసభల్లో ఎన్టీఆర్ ఆశయాలకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర ప్రజ లను అధిక ధరల భారం నుంచి గట్టెక్కించడానికి గత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వలె నెలకోమటుపాయి జీతం తీసుకుని ఎన్టీఆర్ ఆశయాలను నిలబెట్టాలన్నారు. ఎన్నికలానంతరం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేసిందన్నారు. బాబుతో సహా ప్రజాప్రతినిధులందరూ నెలకు ఒక్కరూపాయి తీసుకుని ప్రజలకోసం త్యాగం చేయగలిగే దమ్ము ఉందా అన్నారు. 2014లో "ధరలు తగ్గిస్తాం" అని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, నేడు ప్రతి ఇంటిపై వేల రూపాయల అదనపు భారం మోపింది. పెట్రోల్ బంక్‌కు వెళ్లినా షాక్, గ్యాస్ బుక్ చేసినా షాక్, మార్కెట్‌కు వెళ్లినా షాక్ అనే పరిస్థితి దేశంలో నెలకొంది. ప్రజల జేబులు ఖాళీ అవుతున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రచారాలపై వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రజల కష్టాలు కనిపించడం లేదా? లేక కార్పొరేట్ లాభాలే ముఖ్యమా? ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి. లేకపోతే దేశ యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో బలమైన ఉద్యమాలు చేపట్టడం తప్పదని హెచ్చరిస్తున్నాం.

# మునికూడలి ఘాటును మోడల్ ఘాటుగా తీర్చిదిద్దుతాం : బత్తుల

**బత్తులకు గ్రామస్తులు కృతజ్ఞతలు, సత్కారం - రానున్న పుష్కరాలకు పాతికవేల మందితో సేవలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం మునికూడలి ఘాటుకు ఎంతో విశిష్టత ఉందని, 2027 పుష్కరాలకు ఈ ఘాట్ను ఎంతో సర్వాంగ సుందరంగా మోడల్ ఘాటుగా తీర్చిదిద్దడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కంకణం కట్టుకున్నారని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శనివారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో రానున్న పుష్కరాలు సందర్భంగా మునికూడలి ఘాటుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినందుకు మునికూడలి గ్రామస్తులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, శాసనసభ్యులు బత్తులను అభినందిస్తూ పలువురు సాలువలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ గోదావరి నదితీరాన ఉన్న మునికూడలి ఘాట్ వద్ద ఎందరో మునులు స్థానమాచరించి, వివిధ ఆధ్యాత్మిక, జప కార్యకరణలతో విరాజల్లుతూ ఉండేదన్నారు. అటువంటి పవిత్ర ఆధ్యాత్మిక ప్రాంతానికి పవన్ కళ్యాణ్ పుష్కరాలు సందర్భంగా అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, మునికూడలి ఘాటును మోడల్ ఘాటుగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారని దీనిలో భాగంగా జూన్ 26వ తేదీన మోడల్ ఘాట్ శంకుస్థాపన పనులకు ఆయన చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మరో 13 ఘాట్లను అభివృద్ధి చేస్తామన్నారు. పుష్కరాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, భోజనం వసతి వంటి సౌకర్యాలకు రాజానగరం నియోజకవర్గం వేదిక కానుందన్నారు. పుష్కరాలు కారణంగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతాయని, తద్వారా మంచి గుర్తింపు వస్తుందన్నారు. పుష్కరాల్లో సేవలందించడానికి పవన్ కళ్యాణ్ పదివేల మంది జనసైనికులు, వీర మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారని, అయితే అంతకుమించి పాతికవేల మంది జన సైనికులు, వీర మహిళలు సేవలు అందించడానికి కార్యాచరణ చేపడుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, యర్రంశెట్టి పోలారావు, బదిరెడ్డి దొర, అడపా శ్రీనివాస్, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ,ముని కూడలి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు ఈనెల 31 నుంచే సాగునీరు విడుదల

**ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దశలవారీగా సాగు త్రాగు నీటి విడుదల**
**జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం - రైతులు ముందస్తుగా నాట్లు వేసుకోవాలి : మంత్రి కందుల దుర్గేష్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్-2026 పంటలకు సాగునీరు అందించేందుకు ఈనెల 31 నుంచి ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని జిల్లా సాగునీటి సలహా మండలి (ఐ.ఏ.బి.) సమావేశంలో నిర్ణయించారు. కాలువల మరమ్మతుల పరిస్థితిని బట్టి దశలవారీగా నీటి విడుదల చేపట్టాలని తీర్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలువల మరమ్మతులు కొనసాగుతున్న ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి అవసరమైన మేరకు దశలవారీగా నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు వర్షాలపై మాత్రమే ఆధారపడకుండా ముందస్తు నాట్లు వేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులపై ముందస్తు ప్రణాళిక నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించామన్నారు. అటు వంటి పరిస్థితులు ఎదురైనా రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన నీటి నిల్వలు, పంపిణీ విధానాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, ప్రధాన కాలువలు, ఉప కాలువల ద్వారా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొంతమంది ప్రజాప్రతినిధులు కాలువల మరమ్మతు పనులు పూర్తికాని నేపథ్యంలో నీటి విడుదలను కొంతకాలం వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని సమావేశం లో సూచించారు. దీనిపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, గౌరవ ప్రజా ప్రతినిధులు చేసిన సూచనలు పనుల పురోగతి, సాంకేతిక అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. పనులు 15 రోజుల్లో పూర్తయ్యే అవకాశాలపై స్పష్టత ఇవ్వాలని సూచించారు.

**కాటన్ బ్యారేజీ పరిరక్షణకు భారీ నిధులు: సీఎం చంద్రబాబు**
**జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు**

ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ 175 గేట్ల మరమ్మతులు, బ్యారేజీ పరిరక్షణ చర్యల కోసం సుమారు రూ.148 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. తదుపరి గోదావరి పరిరక్షణకు రూ.100 కోట్ల నిధులిచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సమావేశంలో ధన్యవాదాలు తీర్మానం చేయడం జరిగింది. అదేవిధంగా గోదావరి నది పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల కోసంరాష్ట్ర ప్రభుత్వం చర్యలు రూ.100 కోట్ల నిధుల విడుదల చెయ్యడం పై సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. గోదావరి నదీ పరిరక్షణ, పుష్కరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనులు, మురుగునీటి శుద్ధి, కాలుష్య నియంత్రణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయిం చామన్నారు. ప్రజాప్రతినిధుల సూచనలకుప్రాధాన్యంసాగునీటి పనులు వేగవంతం చేయాలని సూచనలు చేయడం మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నేపథ్యంలో కేంద్ర జలశక్తి మిషన్ ద్వారా ప్రతిపాదిత నిధులను ఒకే విడతలో విడుదల చేయించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కాలువల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సాగునీటి సంఘాలకు మరింత బాధ్యతలు అప్పగించాలని కోరారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాగునీటి విడుదల తేదీల నిర్ణయానికి ముందు ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవడం అవసరమన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి సలహా మండలి సమావేశాలను ముందస్తుగా నిర్వహించడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ముసురుమిల్లి, భూపతిపాలెం, సూరంపాలెం ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సూరంపాలెం క్యాచ్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అంతకు ముందు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తన నియోజకవర్గ పరిధిలో ప్రతిపాదిత సాగునీటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఛైర్మన్ కు కోరారు. ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి కొరత తలెత్తే పరిస్థితి లేదని తెలిపారు. ఈనెల 31 నుంచి సాగునీటి విడుదలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వివరించారు. అక్టోబర్ 31 వరకు సాగు నీటి, త్రాగునీటి అవసరాలు తీర్చే క్రమంలో చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ఇటువంటి సమావేశాల వివరాలు ముందుగా తెలియ చేయడం జరుగుతుంది అని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ, గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్లు జి. శ్రీనివాసరావు, బి. యేసుబాబు, దేవప్రకాశ్, కార్యనిర్వాహక ఇంజనీర్లు ఎన్.పి. రాజేశ్వరరావు, శ్రీనివాస్, వి.వి. రామకృష్ణ, కె. వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# ప్రజల అవసరాలే కూటమి ప్రభుత్వ అభివృద్ధి అజెండా

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - రూ.45 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన - 12వ డివిజన్ అభివృద్ధికి రూ.7.48 కోట్ల భారీ ప్రణాళికలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, 12వ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 12వ డివిజన్‌లోని సోమాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12వ డివిజన్‌లోనే అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఇప్పటివరకు రూ.1.48 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, రూ.63 లక్షల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, మరో రూ.51 లక్షల విలువైన పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అదేవిధంగా రూ.1.24 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అన్ని పనులను కలుపుకుని ఇప్పటికే రూ.3.87 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అంతే కాకుండా మరో రూ.3.61 కోట్ల విలువైన పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, అవి కూడా ఆమోదం పొందిన వెంటనే అమలులోకి వస్తాయని వెల్లడించారు. మొత్తంగా 12వ డివిజన్‌లో రూ.7.48 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజలు కోరుకున్న చోట రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు, పార్కులు వంటి మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అవసరం లేని పనులకు నిధులు ఖర్చు చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. నగరాన్ని ఆరోగ్యకరమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పార్కుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఇప్పటికే పలు పార్కులను అభివృద్ధి చేశామని, వాటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులు చేపట్టడం మాత్రమే కాకుండా వాటిని దీర్ఘకాలం నిలబెట్టే విధంగా నిర్వహణ చర్యలు కూడా చేపడుతున్నామని వివరించారు. గతంలో ప్రజలు సమస్యలు చెప్పినా పరిష్కారం దొరకని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం ప్రజలు కోరిన ప్రతి ప్రాంతానికి వెళ్లి సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాపాలనను కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. నగరంలోని 42 డివిజన్లలో కూడా ఇదే తరహాలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటాయని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలు, సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీతానగరం మండలంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన రుడా ఛైర్మన్ బొడ్డు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సియం ఆర్ ఎఫ్) చెక్కులను రూడా ఛైర్మన్, తూర్పు గోదా వరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ వారి నివాసాలకు వెళ్లి అందజేసారు. సీతానగరం గ్రామంకు చెందిన పైలా దేవుడు కి మంజూరైన రూ.35,554/-ల చెక్కును, రఘుదేవపురం గ్రామానికి చెందిన వనము రాజేంద్ర ప్రసాద్ కు మంజూరైన రూ.20,654/- లవిలువైన చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజ నాలు చేరేలా కృషి చేస్తు న్నామని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న నాయకత్వానికి లబ్ధిదారులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.



### చిన్నప్పుడే అమ్మ చనిపోయింది.. నాన్న తాగుడుకు అలవాటు..

# అనాథశ్రమంలో పెరిగా.. హీరోయిన్ ఎమోషనల్..



సినీరంగుల ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితం అంత అందంగా ఉండదు. వెండితెరపై తమ నటనతో అలరించిన తారలు రియల్ లైఫ్ లో మాత్రం ఎన్నో చీకటి రోజులను గడుపుతుంటారు. ఇటీవల పలు ఇంటర్వ్యూలో తమ చిన్ననాటి చేదు జ్ఞాపకాలను పంచుకుంటూ ఎమోషనల్ అవుతున్నారు పలువురు హీరోయిన్స్. తాజాగా ఓ నటి తన లైఫ్ గురించి చెప్తూ బావోధ్వేగానికి గురైంది. సినీరంగంలో అందం, అభినయంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తారలు చాలా మంది ఉన్నారు. అందులో తేజస్వి మాదివాడ ఒకరు. హీరోయిన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు సినిమాలలో నటించి ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసింది. సినిమాల కంటే ఎక్కువగా ఆమె రియాల్టీ షోలు, టీవీ ప్రోగ్రామ్స్, వెబ్ సిరీస్ ద్వారానే పాపులర్ అయ్యింది. ముఖ్యంగా బిగ్ బాస్ సీజన్ 2లో పాల్గొని తన ఆట తీరు, చలాకీతనంతో ఫేమ్ తెచ్చుకుంది. తెలుగులోనే కాకుండా హిందీలో పలు షోలలో పాల్గొని అక్కడ సైతం మరింత ఫేమస్ అయ్యింది. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తుంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన లైఫ్ గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యింది. తేజస్వి మాట్లాడుతూ.. "నాన్న సింగరేణిలో పనిచేసేవాళఅలు. నాకు నాలుగేళ్లు ఉన్నప్పుడే మా నాన్నకు హైదరాబాద్ ట్రాన్ఫర్ అయ్యింది. దీంతో ఫ్యామిలీ మొత్తం ఇక్కడకు షిఫ్ట్ అయ్యాం. నాకు ఏడేళ్ల వయసులో మా అమ్మకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. కొన్నాళ్లు చికిత్స తీసుకుంది. నాకు 11 సంవత్సరాలు ఉన్నప్పుడు మా అమ్మ చనిపోయింది. అమ్మ చనిపోయాక నాన్న మందుకు అలవాటు పడ్డారు. అప్పుడు మా నాన్నను చూడాలంటే భయమేసేది. నాన్న తాగి ఎప్పుడూ తిడుతుండేవాడు. ఆయన టార్చర్ భరించలేక 18 సంవత్సరాలు రాగానే ఇంట్లో నుంచి పారిపోయాను. కొన్నాళ్లు అనాథశ్రమంలో ఉన్నాను. నాకు నేనే సోలోగా బతకడం నేర్చుకున్నాను" అని చెబుతూ ఎమోషనల్ అయ్యింది. ఎప్పుడు సరదాగా, సంతోషంగా కనిపించే తేజస్వి జీవితంలో ఇన్ని కష్టాలు ఉన్నాయని తెలిసి ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్. ఇంట్లో నుంచి పారిపోయిన తర్వాత తినడానికి తిండి లేక ఎంతో కష్టాలు పడ్డానని.. ఒక ఫ్రెండ్ ఫ్యామిలీ సపోర్ట్ ఇవ్వడంతో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ సినీరంగంలో అవకాశాల కోసం ప్రయత్నించానని చెప్పుకొచ్చింది.

# జూన్‌లో సినిమాల జాతర..


## రిలీజ్‌కు రెడీ అవుతున్న అరడజను సినిమాలు



కొత్త సినిమాలు ప్రతి నెల పదుల సంఖ్యలో విడుదలవుతున్నాయి. కానీ ఈ సమ్మర్ లో పెద్దగా సినిమాలు విడుదల కాలేదు. దాంతో ఆడియన్స్ ఒకింత నిరాశకు గురయ్యారు. మేలో చెప్పుకోదగ్గ సినిమాలు విడుదల కాకపోవడంతో ఇప్పుడు జూన్ పై అందరు దృష్టి పెట్టారు. నిజానికి సమ్మర్ సీజన్ లో సినిమాల సందడి ఎక్కువ ఉండాలి. సమ్మర్ హాలిడేస్ ను ఉపయోగించుకోవడానికి మేకర్స్ ఎప్పుడూ రెడీగా ఉంటారు ఈ క్రమంలోనే ఏప్రిల్, మే , జూన్ నెలల్లో సినిమాలు విడుదల చేయాలని చూస్తుంటారు. కానీ ఈ ఈఏడాది మే సప్పుగా సాంగింది. పెద్దగా సినిమాల హడావిడి కనిపించలేదు. విడుదలైన ఒకటి ఎండు సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపలేకపోయాయి. ఇక ఇప్పుడు జూన్ పై అందరి దృష్టి పడింది. జూన్ ను టార్గెట్ చేసుకొని అరడజను సినిమాలు రిలీజ్ కు రెడీ గా ఉన్నాయి. మరి వీటిలో ఏది విజయం సాధిస్తుందో చూడాలి. ఇక జూన్ లో విడుదల కానున్న సినిమాల పై ఓ లుక్కేద్దాం..! జూన్‌లో విడుదలవుతున్న మొదటి బిగెస్ట్ సినిమా పెద్ది. బుచ్చుబాబు సన దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా పెద్ది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచుస్తున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్ విపరీతమైన హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా భారీ హిట్ అవ్వడం ఖాయం అంటున్నారు ఫాన్స్. అలాగే పెద్ది సినిమా తర్వాత సింగ్ గీతం అనే సినిమా వస్తుంది. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కామెడీ నేపథ్యంలో సాగనుందని తెలుస్తుంది. ఈ సినిమా జూన్ రెండో వారంలో విడుదలకానుంది. ఇక సమంత హీరోయిన్‌గా నటిస్తున్న మా ఇంటి బంగారం సినిమా కూడా జూన్ లో విడుదలకానుంది. సమంత భర్త రాజ్ నిడిమోరు క్రియేషన్ లో నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఇంటి బంగారం సినిమా జూన్ మూడో వారంలో విడుదలకానుంది. అలాగే అఖిల్ నటిస్తున్న లెనిన్ సినిమా కూడా జూన్ మూడో వారంలో విడుదలకానుంది. దీవానా, ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు, బాలన్ లాంటి సినిమాలు కూడా విడుదలకానున్నాయి. ఫైనల్ గా తమిళ్ సీఎం దళపతి విజయ్ నటించిన లాస్ట్ మూవీ జననాయగన్ కూడా జూన్ లోనే విడుదలకానుంది. ఈ సినిమాల్లో ఏ సినిమా భారీ హిట్ అవుతుందో చూడాలి.

# మహా సంగ్రామానికి వేళాయే..

## ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్‌లో ట్రోఫీ ఎవరిది?



ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ ప్రిడిక్షన్ లీగ్ స్టేజ్ అంతా తిరుగులేని ప్రదర్శన చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నప్పటికీ, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్‌ను తక్కువ అంచనా వేయలేం. అహ్మదాబాద్ హోమ్ గ్రౌండ్ కావడం గుజరాత్‌కు కలిసివచ్చే అంశం. ఏదేమైనా ఆదివారం రాత్రి అహ్మదాబాద్ వేదికగా క్రికెట్ అభిమానులకు కనువిందు ఖాయం. ఐపీఎల్ 2026 తుది సమరానికి సమయం ఆసన్నమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఆదివారం రాత్రి 7:30 గంటలకు ఈ మహా ఘట్టం జరగనుంది. రెండో ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడడమే లక్ష్యంగా ఇరు జట్లు సర్వశక్తులూ ఒడ్డడానికి సిద్ధమయ్యాయి.

**టైటాన్లతో బెంగళూరు ఢీ.. రెండో ట్రోఫీపై ఇరు జట్ల కన్ను..!**

క్రికెట్ పండుగ ఐపీఎల్ 2026 చివరి అంకానికి చేరుకుంది. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), క్వాలిఫయర్-1 లో అదే బెంగళూరు చేతిలో ఓడినా.. ఆ తర్వాత క్వాలి ఫయర్-2 లో రాజస్థాన్ రాయల్స్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకొచ్చిన గుజరాత్ టైటాన్స్ ఇప్పుడు అహ్మదాబాద్ వేదికగా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ సీజన్‌లో ఇరు జట్లు తలపడటం ఇది నాలుగోసారి. గత మూడు మ్యాచ్‌లలో ఆర్సీబీ రెండు సార్లు గెలవగా, గుజరాత్ ఒక మ్యాచ్‌లో విజయం సాధించింది. చరిత్ర సృష్టించి తమ రెండో ఐపీఎల్ కప్‌ను సొంతం చేసుకోవాలని ఇరు జట్లూ తహతహలాడుతున్నాయి.

**అహ్మదాబాద్ పిచ్ రిపోర్ట్: బ్యాటర్ల స్వర్గధామం.. కానీ!**

ప్రపంచంలోనే అతిపెద్దదైన అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం పిచ్ సాంప్రదాయకంగా బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తుంది. ఈ సీజన్‌లో ఇక్కడ భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఇక్కడే 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, ఇక్కడి పిచ్ పరిస్థితుల ప్రకారం పేస్ బౌలర్లు (సుమారు 76 శాతం) కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

**ఈ మైదానంలో ఇప్పటివరకు జరిగిన 45 ఐపీఎల్ మ్యాచ్‌ల గణాంకాలను పరిశీలిస్తే:**

మొదట బ్యాటింగ్ చేసిన జట్టు విజయం: 60%, మొదట బౌలింగ్ చేసిన జట్టు విజయం: 40%, తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు: 183 పరుగులు, రెండో ఇన్నింగ్స్ సగటు స్కోరు: 165 పరుగులు, టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్ చేసి భారీ స్కోరు బోర్డుపై ఉంచడానికే మొగ్గు చూపవచ్చు.

**ఇరు జట్ల బలాబలాలు.. ఫామ్ ఎలా ఉందంటే?**

ప్రస్తుత ఫామ్, హెడ్-టు-హెడ్ రికార్డులను పరిశీలిస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు స్పష్టమైన ఆధిక్యంలో కనిపిస్తోంది. ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య జరిగిన 9 మ్యాచ్‌లలో ఆర్సీబీ 5 సార్లు, గుజరాత్ 4 సార్లు విజయం సాధించాయి. ఆర్సీబీ తన చివరి ఐదు మ్యాచ్‌లలో నాలుగింటిలో గెలిచి మంచి జోష్‌లో ఉండగా, గుజరాత్ హెచ్చుతగ్గులతో మూడు విజయాలను నమోదు చేసింది. క్వాలిఫయర్-1 లో ఆర్సీబీ ఏకంగా 92 పరుగుల భారీ తేడాతో గుజరాత్‌ను ఓడించడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

**మ్యాచ్‌ను మలుపు తిప్పే కీలక ఆటగాళ్లు**

**టాప్ బ్యాటర్లు:**

**శుభ్‌మన్ గిల్ (గుజరాత్ టైటాన్స్):** గత మ్యాచ్‌లో అద్భుత శతకంతో జట్టును ఫైనల్‌కు చేర్చిన కెప్టెన్ గిల్, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 722 పరుగులతో టాప్ ఫామ్‌లో ఉన్నాడు.

**రజత్ పాటిదార్ (ఆర్సీబీ):** క్వాలిఫయర్-1 లో కేవలం 33 బంతుల్లో 93 పరుగులు చేసి గుజరాత్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఆర్సీబీ కెప్టెన్ పాటిదార్ మరోసారి జట్టుకు వెన్నుముకగా నిలవనున్నాడు. విరాట్ కోహ్లీ కూడా లీడ్ రోల్‌లో ఉన్నాడు.

**టాప్ బౌలర్లు:**

**కగిసో రబాడా (గుజరాత్ టైటాన్స్):** గత మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టి, మొత్తం 28 వికెట్లతో ప్రస్తుతం పర్పుల్ క్యాప్ హోల్డర్‌గా ఉన్న రబాడా పవర్‌ప్లేలో ప్రమాదకరంగా మారనున్నాడు.

**భువనేశ్వర్ కుమార్ (ఆర్సీబీ):** ఈ సీజన్‌లో 26 వికెట్లతో అదరగొడుతున్న భువీ.. క్వాలిఫయర్-1 లో గుజరాత్‌పై 28 పరుగులకే 2 వికెట్లు తీసి దెబ్బకొట్టాడు.

**అంచనా స్కోర్లు - ఎవరి విజయావకాశాలు ఎంత?**

సందర్భం 1: గుజరాత్ టైటాన్స్ మొదట బ్యాటింగ్ చేస్తే

పవర్‌ప్లే స్కోరు: 50-55 పరుగులు

మొత్తం స్కోరు అంచనా: 170-180 పరుగులు

విజయావకాశం: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలిచే అవకాశం ఎక్కువ.

సందర్భం 2: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మొదట బ్యాటింగ్ చేస్తే

పవర్‌ప్లే స్కోరు: 60-65 పరుగులు

మొత్తం స్కోరు అంచనా: 200-220 పరుగులు

విజయావకాశం: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం ఖాయం.

విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలిచే అవకాశాలు 60 శాతం ఉండగా, గుజరాత్ టైటాన్స్ విజయావకాశాలు 40 శాతంగా ఉన్నాయి.

**తుది అంచనా**

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:** వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృణాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, జోష్ హేజిల్‌వుడ్, రసీఖ్ సలామ్ దార్.

**గుజరాత్ టైటాన్స్:** సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్ సాయి కిషోర్, కగిసో రబాడా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com